# రావూరి భరద్వాజ



# పాడ్యమి

## కథల సంపుటి

## డాక్టర్ రావూరి భరద్వాజ

## సంపాదకీయం

**భ**రద్వాజ తొలి కథా సంపుటం 1950వ సంవత్సరంలో వెలువడింది. ఆ పుస్తకం పేరు "రాగిణి". దాన్ని ప్రచురించింది కళావాణి పబ్లికేషన్స్ తెనాలి వారు. ఈ కథలను ఏర్చి కూర్చి, చిన్న సంపాదకీయంతో ప్రజలకందించిన వారు శ్రీ శార్వరి.

అసలంతకు ముందే మరో కథా సంపుటం రావలసి ఉంది. ఆ పుస్తకం పేరు 'ప్యాడమి'. దాన్ని ప్రచురించ వలసింది 'కవితా కుటీరం' అన్న సాహితీ సంస్థవారు. ఈ సంస్థను, భరద్వా, శార్వరి కలిసి ఏర్పాటు చేశారు. ఈ 'పాడ్యమి' కథా సంపుటం త్వరలో వెలువడబోతున్నదని, తెనాలి నుండి ప్రచురింపబడే 'జ్యోతి' పక్షపత్రికలో ఒక ప్రకటన కూడా వెలువడింది. ఆర్థిక కారణాల వల్లా, దక్షత లేకపోవడం వల్లా, ఆ పుస్తకం వెలుగును చూడనే లేదు.

మూడున్నర దశాబ్దాల తర్వాత 117 పుస్తకాలు అచ్చయ్యాక, 118వ పుస్తకంగా వస్తున్న ఈ కథా సంపుటానికి కూడా 'పాడ్యమి' అన్న పేరునే భరద్వాజ ఖయం చేశాడు. అందులో ఈ పేరుగల కథ లేకపోవడం నాకు ఆశ్చర్యం కలిగించలేదు. ఆ మాట కొస్తే 'వసుంధర' అన్న కథా సంపుటిలో కూడా, ఆ పేరున్న కథ లేదు. ఒక పుస్తకంలో వున్న ఏదో ఓ కథ పేరునే, పుస్తకానికి పెట్టడం, మనకు ఆనవాయితీగా వస్తున్నదే!

ఈ సంపుటంలోని కథలు చాలా కొత్త తరహాకు చెందినవి. మద్రాసులో, ధనికొండ హనుమంతరావుగారి పత్రికల్లో పనిచేస్తున్నప్పుడూ, అంతకు ముందూ, ఆ తరువాత కూడా, కథా రచనలో రకరకాల ప్రయోగాలు చేశాడు.

భరద్వాజ చేసిన ఈ ప్రయోగాలు విషయానికి సంబంధించినవీ, అభివ్యక్తికి సంబంధించినవీ కూడా ఇవన్నీ విజయవంతమయ్యాయి.

ఇప్పుడు, మరో కొత్త ప్రయోగం చేశాడు భరద్వాజ. ఒక పదానికున్న నానార్థాలకూ, అర్థచ్ఛాయలకూ అవగతం చేసుకొని, అందుకు అనుగుణంతా, కథను అల్లుకొంటూ రావడం వీటిలోని ప్రత్యేకత. నిజానికిది పాండిత్యానికీ, భాషా శాస్త్రానికీ సంబంధించిన వ్యవహారం, ఇందులో

బరువూ, క్లిష్టతా కూడా ఉన్నాయి. ఎంతో ఆసక్తి వుంటే తప్ప, ఇటువంటి వాటి జోలికి సాధారణ పాఠకులు వెళ్ళరు. ఆ బరువును, క్లిష్టతను కొంత 'ఆవంత'- 'తేనీరు' - 'పుట్టి' అన్న కథలు, ఇందుకు ఉదాహరణలుగా పేర్కోవచ్చు.

నిత్య జీవితంలో తనకు తారస పడిన ప్రతి వ్యక్తినీ, ఎదురైన ప్రతి సంఘటననూ, తన రచనలో ఎక్కడో ఒకచోట, ఎప్పుడో ఒకప్పుడు భరద్వాజ స్పర్శలో, రసగుళికగా మారడం మనకు తెలిసిందే! ఒకానొక సాధారణ వ్యక్తి, అతని రచనలో అసాధారణ వ్యక్తిగా భాసించడం కూడా మనకు తెలిసిందే! ఆకాశవాణిలో అప్పుడప్పుడు వినిపించే ''ప్రకటించిన కార్యక్రమానికి బదులు'' అన్న ఒక ప్రకటన చుట్టూ అద్భుతమైన కథను భరద్వాజ అల్లుకొచ్చాడు. ఈ కథలో- నిత్య జీవితంలోని ఎన్నో సంఘటనలను ఎంతో కళాత్మకంగా చిత్రించాడు.

''ఆమె కథ- కాదు కళ్ళ కథ- కాదు కాదు ఆ కళ్ళ కథ'' అన్న రచనను 'కథ' అంటే సరిపోదు. దానికొక వచన కథాకావ్యంగా రచయిత తీర్చిదిద్దాడు. భరద్వాజ దృష్టి వైశిత్యానికీ, కథా కథన శిల్ప విన్నా ణానికీ, ఇదొక ప్రతీక. తన రచనకు సంబంధించిన ప్రతి సూక్ష్మాంశధాన్నీ భరద్వాజ ఎంతస్పష్టంగా దర్శించగలడో, అంత స్పష్టంగానూ పఠితకు దర్శనీయం చేయగలడనడానికి ఈ కథ ఒక అచ్చుమచ్చు.

''కథానాయకుడు దొరికాడు; ఇక కథ దొరకాలి'' అన్నది ఓ సరికొత్త శిల్పాన్ని పొదువుకున్న కథ. విషయం మామూలుదే! ఒక అమ్మాయి, ఒక అబ్బాయి, ప్రేమించుకొంటారు. అబ్బాయి అమ్మాయిని మోసం చేసి వెళ్ళిపోతాడు. ఆ అమ్మాయికో కొడుకు పుడతాడు. ఆ కొడుకే కథానాయకుడంటారు భరద్వాజ. పుంజీలకొద్దీ ప్రతీకలను, మనముందు పరమాద్భుత రీతిలో పరచుకొంటూ పోతాడు రచయిత. కథానాయకుని భయాలు, కోపాలు ఇష్టా యిష్టాలు, భరద్వాజ మనకు చెపుతున్నాడనుకొంటాం. అలా చెబుతూనే, కథానాయకుడు మనస్తత్వాన్నీ, ఆ మనస్తత్వం వెనుక గల చేదు అనుభవాల పరంపరనూ మనకు అవగతం చేస్తాడు.

''ఈసారికిలా పోనీండి'' అన్న రచనలో భరద్వాజ నవలలలోని రెండు పాత్రలు మనకు తారసపడతాయి. 'పాకుడు రాళ్ళు' నవలలోని మంజరి పాత్ర; 'కాదంబరి' నవలలోని 'కౌముది' పాత్ర; రచయితను కలుసుకొని, తమ నెందుకలా చిత్రించిందీ చెప్పమని నిలదీసి అడుగుతాయి. ఆ పాత్రలడిగిన ప్రశ్నలన్నింటికీ, భరద్వాజ సోపపత్తికంగా సమాధానాలిస్తాడిందులో. ఈ రెండు నవలలను గురించీ, వివిధ పత్రికలలో వెలువడిన విశ్లేషణాత్మక వ్యాసాలను దృష్టిలో పెట్టుకొని, భరద్వాజ ఈ రచన చేశాడనిపిస్తుంది. ఆయా వ్యాసాలలోనూ, సమీక్షలలోనూ, విమర్శలలోనూ వెలిబుచ్చిన సందేహాలన్నింటికీ; ఇందులో సమాధానాలు దొరుకుతాయి. ఇదొక నూతన పద్ధతి.

1949వ సంవత్సరంలోనే 'పాడ్యమి' కథా సంపుటి వెలువడి వుంటే, అందులో ఏ తరహా కథలుండేవో ఊహించటం మనకంత కష్టం కాదు. 'రాగిణి'లోనూ, 'కొత్త చిగుళ్ళు'లోనూ వున్న కథల్లాంటివే ఉండేవి! ఈ 'పాడ్యమి' అలాంటిది కాదు. రెండున్నర దశాబ్దాల వైవిధ్య పూరితమైన జీవితానుభవాల సారాన్నంతా వొడిసి పీల్చుకొని, పూర్తిగా విరగపండిన కథలు- ఈ సంపుటిలో

చోటు చేసుకొన్నాయి. విషయమూ కొత్తదీ! కథా కథన రీతి కొత్తదే!! చదివి చూడండి మీకే తెలుస్తుంది!!

కవిరాజ సాహితీ సదనమ్ త్రిపురనేని సుబ్బారావు

హైదరాబాద్ - 890 **26-1-1984**

1. ఆవంత (17-11-82 ఆంధ్ర (వార)ప్రభలో ప్రకటితం)
2. ప్రకటించిన కార్యక్రమానికి బదులు... (14-5-82, ఆంధ్ర (వార)పత్రికలో ప్రకటితం)
3. తే నీరు (24-782 ఋూంధ్ర (దిన) ప్రభలో ప్రకటితం)
4. కథానాయకుడు దొరికాడు: ఇక కథ దొరకాలి (అక్టోబరు, 1983 విపులలో ప్రకటితం)
5. పుట్టి (జూన్ 1983 సాధనలో ప్రకటితం)
6. ఈసారి కిలా పోనీండి! (విశాలాంధ్ర 10-9-83, 18-983, 25-983, 2-10-83వ తేదీ సంచికలలో ప్రకటితం)
7. ఆమె కథ - కాదు కళ్ల కథ - కాదు కాదు ఆ కళ్ల కథ (17-9-82 ఆంధ్ర (వార) పత్రికలో ప్రకటితం)

**వీరందరకూ కృతజ్ఞతలు**

**మిత్రులు**

# శ్రీ పి.బాబుల్ రెడ్డి

**గారికి**

# ఆవంత!

**అయ్యా/ అమ్మా!**

పాతికేళ్ళ కిందట నా వయస్సు ముప్పయ్ ఏళ్ళు. నా ముప్ఫయ్యో ఏట - మీకూ - తెలిపిన సంగతే; నేను మద్రాసులో ఉన్నాను.

అసలూ - అది కాదు సంగతి!

''సర్వజ్ఞ నామ ధేయము

శర్వునకే, రావుసింగ నరపాలునికే

యుర్విం జెల్లును, తక్కొరు

సర్వజ్ఞుండనుట, కుక్క సామజ మనుటే!''

ఎవరు చదివారో గుర్తు లేదు గానీ, ఆ పద్యం చదివి, వో అక్షరాన్ని అటూ ఇటూ మార్చి, మళ్లీ చదివి, అందులోని చమత్కారాన్ని చెప్పుకుంటూ పోయారాయన.

శాస్త్రిగారు - అదే- రామకృష్ణ శాస్త్రిగారు - గట్టిగా సిగరెట్టు లాగి, సవాదుగా పొగ వదులతూ సాభిప్రాయంగా నా వేపు చూశారు. ఆ చూపుకు అర్థమేమిటంటే-

''నాయనా! అలాంటి పజ్జాలు నీ కేమన్నా వచ్చునా? వస్తే గిస్తే చదవరాదా?'' అని.

శ్రీరంగం నారాయణబాబు గారు కూడా నా వేపు చూశారు. మా ధనికొండ హనుమంతరావు, ఈలోగా వేయించిన వేరు సెనగలు - కాయలు సుమా- తెప్పించారు.

''తగిన మగవాని కౌగిటం దవిలియున్న

అళిచికుర యౌవనమ్మది యౌవనమ్ము

తగని మగవాని కౌగిటం దవిలియున్న

అళిచికుర యౌవనమ్మది - యౌ-వనమ్ము

''అన్నానో లేదో 'భేషో భేషు' అంటూ వెన్ను చరిచారు మల్లాది శాస్త్రిగారు.

శ్రీరంగం నారాయణబాబుగారి కళ్ళు వో క్షణం పాటు 'జిల్లు'మని మెరిశాయి.

''మరేమనుకొన్నారు- మావాడంటే! అక్షరాలా- శాస్త్రిగారూ!- మావాడేనండీ!'' అంటూ ఇంతలా ఉబ్బిపోయాడు మా ధనికొండ.

అదిగో- ఆ తరువాత జరిగిన చర్చ- ఈ కథకు మూలబీజం అయిందండీ!

''పజ్జాల్లో ఇలాంటి చమక్కులు చాలా చాలా చూపించవచ్చు గానండీ శాస్త్రిగారూ, వచనంలో కుదరదండీ'' అని నిక్కచ్చీ చేసుకొని, నా వేపు చూపి, శాస్త్రిగారివేపూ చూసి, ఏదో అనుమానం లోపల మసకలాడగా, ''కుదరదేమోననుకొంటానండీ!'' అని వాక్యాన్ని కాస్తంత దిద్దుకొన్నారు

నారాయణబాబు!

చెప్పాగదూ- మల్లాది శాస్త్రిగారు చెప్ప వలసినదంతా చూపులతోనూ, చిరునవ్వులతోనూ చెబుతారని!

"అసలు మనం ప్రయత్నం చేయాలిగదా బాబుగారూ! చేశాక- మనకు సాధ్యం కాకపోతే అప్పుడందాం- 'మనకు సాధ్యం కాదండీ' అని. అస్సలు మనం ప్రయత్నించకనే పోతిమి. అలాంటప్పుడు 'కుదరదు' అనుకోవడమూ తప్పే, 'కుదరదేమో' అనుకోవడమూ తప్పే!" అన్నాను నారాయణ బాబుగారితో.

ఈ అనడముందే- కాస్త గొంతు పెంచే అని ఉంటాను. అంతో ఇంతో రోషంతోనూ అని ఉంటాను.

ఎందుచేతనా?

ఆ వయస్సు అలాంటిది!

ఆ క్షణాన మనస్సులో నాటుకున్నదండీ ఈ కథా బీజం!

మొదణ్ణించీ నాకో దిక్కుమాలిన అభ్యాసముంది. కలం పుచ్చుకొని 'ఏం రాయడం? ఎలా రాయడం?' అని ఎప్పుడూ ఆలోచించను. ఏం రాయవలసిందీ, ఎలా రాయవలసిందీ లోపల ఎప్పుడో ఖరారయి పోయి ఉంటుంది. చేయవలసిందేమిటంటే- లోపల ఉండి పోలేక, నన్ను కకావికలు చేసి పారేసే దాన్ని కాగితాల మీదకు వడ్డించడం. ఈ వడ్డన ఒక్కోసారి సద్యోగర్భంలా చటుక్కున జరిగిపోతుంది. ఒక్కొక్కసారి అడక్కండి- ఏళ్ళూ పూళ్ళూ పడుతుంది.

మరో దిక్కుమాలిన అలవాటేమిటంటే-ఆ కథకు మంచి 'శీర్షిక' దొరకాలి. కథ యావత్తూ పండి, పక్వమయి, సిద్ధంగానే ఉంటుంది. కానీ శీర్షికోదయం జరగదు. అదేదో జరిగిందాకా- కథ రాదు.

అదృష్టవశాత్తూ- ఈ కథకు ఆ ఇబ్బంది కూడా లేకుండా పోయింది. ముందుగా 'ఆలవింత' అని రాశాను. అయితే 'ఆవలింత'ను 'ఆలవింత'గా మార్చడం నాకెందుకో నచ్చలేదు. అందుకని 'ఆవంత'గా దాన్ని సవరించాను.

అయ్యా, అమ్మా!

'ఆవంత' కథాక్రమం బెట్టిదనిన-

సందేహం లేదు. చలమయ్య చాలా పెద్ద మనిషి. ఆలోచించిగానీ మాటను పెదవి మీదికి రానీయడు. వచ్చిందా- హరిహరాదులు అడ్డమొచ్చినా దానికి తిరుగు చెప్పడు. 'మాట నిలబెట్టుకోవడం' అన్న లక్షణం- అసలా వంశంలోనే ఉంది. చలమయ్య తండ్రి బసవయ్య. ఆయన అక్షరాలా బసవదేవుడే! అప్పుడెప్పుడో ఆ వూళ్ళో సత్రం కట్టిస్తానన్నాడట. ఆయనకు నీలిమందు వ్యాపారంలో చావు దెబ్బ తగిలింది. అయినా బసవయ్య గారు ఆడిన మాట తప్పలేదు. నష్టంలో నష్టంగా ఆయనగారు నాలుగెకరాల పాటి పొలం అమ్మేసి, కొండ వాలునే తన పేరు మీదుగా సత్రం

కట్టించేశాడు.

తండ్రి పేరును చలమయ్యగారు నిలబెట్టడమే కాదు. ఇంకా పెంచేశారు కూడా. ఆ సత్రం దాపులోనే చలమయ్య బావి తవ్వించారు. ఆ సత్రానికి తనో నాలుగెకరాల పొలం- అదీ పాటి పొలమే- దానంగా రాసేశారు. ఆ పొలం మీద అయివేజుతో 'సదాచారం' నడిపే ఏర్పాట్లు చేశారు.

అలాంటి చలమయ్య కూతురు పెళ్ళి విషయంలో మాట తప్పుతాడా? కూతురు ఒంటిమీది బాలతొడుగుల్ని గురించి వయ్యంకునితో చెప్పడంలో తభావతు లొచ్చాయిట. అవతలి వారు యాగీకి దిగారు.

"అప్పుడన్నదే, ఇప్పుడూ అంటున్నాను. ఎపిల్లదానికి 'వడ్డాణం' ఉన్నదన్నానే గానీ 'గజ్జెల వడ్డానం' ఉన్నదనలేదు" అన్నాడు చలమయ్య.

"మాకు - అలాగెలా వినిపించిందయ్యా మరి?" అన్నారు అవతలి వారు.

"నే నన్నదానికి నేను జవాబుదారీగానీ, మీరు విన్నదానికి నే నెలా జవాబుదారీ తీసుక్కొంటానయ్యా? మీరు వేయి వింటారు- లక్ష వింటారు. మరి నేనేం చేయనూ?" అన్నాడు చలమయ్య స్థిమితంగా.

"మీ ఇంట్లో - అస్సలు గజ్జల వడ్డానమే లదా?" అన్నాడు వియ్యంకుడు, అనుమానంలోకి పడిపోతూ.

"ఉంది. ఉందిగానీ, అది మా ముసల్దాని సొత్తు. ఈ ఇంటి పెద్ద కోడలే దాన్ని పెట్టుకోవాలి గానీ ఇంటి ఆడపడుచులు కారు. ఈ ఆనవాయితీ చాలా కాలంగా మా ఇంటా వంటా ఉన్నదే!" అన్నాడు చలమయ్య, తలగుడ్డ తీసి దులిపి, భుజం మీద వేసుకొంటూ.

మేళాలు ఆగిపోయాయి. వచ్చిన వారందరూ దిక్కు తోచక బిత్తరపోయి చూస్తున్నారు. ఈ ఒక్క సంగతీ తెలితే ఇక సూత్రధారణం జరిగిపోతుంది.

"పోనీండి బావగారూ! వడ్డానం ఎలానూ ఇస్తున్నారు. ఇక గజ్జల దగ్గరా మనం పేజీ పడవలసింది? తరువాత ఇస్తాననండి- కార్యం జరిగిపోతుంది" అని సలహా ఇచ్చారెవరో.

"అన్న మాట మీద నిలబడాలయ్యా! కావాలని ఇప్పుడు అడగమనండి. ఇచ్చేస్తాను. అంతేగానీ, బాల తొడుగుల్లోనే గజ్జల వడ్డానం కూడా ఉన్నదని వారు బుకాయిస్తే- ఇహ - కుదరదు. నేనా మాట అనలేదు- ముమ్మాటికీ చెబుతున్నాను అ-న-లే-దు. నా మాటలో 'ఆవంత' తేడా ఉంటే నన్ను బొడ్లో చెయ్యేసి నిలబెట్టి మరీ కడిగేయండి! అంతేగానీ- మనుషుల్ని ఇరుకుల్లో బిగించేసి, దత్తి తీర్చుకోడం నా వంశంలోనే లేదు" అన్నాడు చలమయ్య భగ్గురుమని మండిపోతూ.

నలుగురూ కలగజేసుకుని అవతలి వారికి సర్దిచెప్పి సూత్రధారణం చేయించారు.

సందేహం లేదు. చలమయ్య చాలా పెద్దమనిషి. ఆలోచించి గానీ మాటను పెదవి మీదికి రానీడు. వచ్చిందా-హరిహరాదులు అడ్డ మొచ్చినా ఆ మాటకు(ఆవ(గింజ)ంత తేడా రానీడు.

* * *

అప్పారావు చిరాకుపడుతున్నాడు. చిన్న వాళ్ళమీద గావు కేక లేస్తున్నాడు. పెద్దవాళ్ళను, ఏమీ అనలేక - ఆ కోపం నాలాంటి వాళ్ళమీద చూపిస్తున్నాడు. వాడేదో అన్నాడని కాదు గానీ అసలు మాకు మాత్రం బుద్ధీ జ్ఞానం ఉండక్కర్లా! రెండు మాసాల కిందట - పనిమాలా అందర్నీ పిలిచి, ఫలానా రోజున మొదటి రిహార్సల్ జరుగుతుందనీ, అప్పటికి అందరికీ పోర్షన్లు రావాలనీ మా అప్పారావు చిలక్కు చెప్పినట్లు చెప్పాడు. 'సరే' నన్నాం. సగానికి సగం మందికి పట్టుమని పది డైలాగ్స్ కూడా రాలేదు.

''ఇలాగయితే లాభం లేదురా! మనం పండక్కు నాటకం ఆడలేం! పోనీ మానేద్దామంటావా? ఎవడికో పుట్టిన బిడ్డ కింద, మన సమాజం ఉండడం నాకిష్టం లేదు'' అన్నాను, పుస్తకాన్ని నేలకేసి విసిరేస్తూ.

కాస్సేపాగి నేనే అన్నాను-

''పోనీ ఇంకోపని చేద్దాం! ఇదే మొదటిసారిగనుక, మరీ అంతలా బిగదీసుకుపోకూడదు. ఎవరెవరికి ఏ యే సీన్స్ వస్తాయో తెలుసుకొందాం! అంతవరకూ రిహార్సల్ వేద్దాం. కొంత గాక పోయినా, కొంతయినా నాటకం నలుగుతుంది. రెండో రిహార్సల్ వారం పది రోజుల్లో ఏర్పాటు చేద్దాం. నువ్వన్నట్లు (పాపం! అసలు వాడేమీ అనలేదండీ) ఆ రోజుక్కూడా పోర్షన్ రానివాళ్ళను నాటకంలోంచి లాగి పారేదాం! ఏమంటావ్?'' అన్నాను అప్పారావును చల్లబరిచే ఉద్దేశంతో.

''ఏదోలా అఘోరించండి! నేనిక్కడ కూచుంటా. మీ ఇష్టం వచ్చిన సీన్స్ తగలెయ్యండి... అంతా అడవా సరుకు దొరికింది'' అని గొణుక్కున్నాడు అప్పారావు.

ఏదోరకంగా అప్పారావు దారికొస్తాడన్న నమ్మకం నాకుంది. మా చేత నాటకం ఆడించడమన్నది వాడి జీవిత లక్ష్యం కాదు. 'దర్శకత్వం: ఫలానా!' అని పేరు తెచ్చుకోవడమే అప్పారావు జీవిత లక్ష్యం. ఈ లక్ష్య సాధనకు మేం ఉపయోగపడతామనుకున్నాడు గనక, మా చేత నాటకం వేయిస్తున్నాడు. మేం 'కా'దన్నా మనుకోండి- ఇంకో సమాజాన్ని పట్టుకొంటాడు. అప్పారావు సంగతి నాకు తెలీనిదేమీ కాదు.

ఆరా తీస్తే నాలుగో రంగంలోని, రెండో సీనులో ఉండే పోర్షన్లు కంఠతా వచ్చినట్లు తేలింది.

ఆ సీను ఎలా ప్రారంభమవుతుందంటే...

అంతకుముందు సీనులో మహారాజుగారు సకల సైన్యాలతో యుద్ధానికి బయలుదేరి వెళ్ళిపోయారు. ఆ ప్రభువులుంగారు రణోత్సాహంతో బయలుదేరబోయే ముందు, అపశకునాలు ఎదురవుతాయి. అయినా, వారు వినరు. శత్రురాజుతో జరిగిన ఘోర సమరంలో రాజుగారు తీవ్రంగా గాయపడ్డారు. ఆ వార్త మహా రాణికి తెలిసింది. ఇదీ జరిగిన కథ.

తెర లేవగానే మహారాణి జుత్తు విరబోసుకుని ఒక మూలగా ఒదిగి కూచుని ఉంటుంది. అప్పుడే పదహారేళ్ళ వయస్సుగల ఆమె కుమారుడు రంగ ప్రవేశ చేస్తాడు. వస్తూనే తల్లిని చూసి, ఆమె కన్నీటిని తుడుస్తాడు. తుడిచిందాకా ఒక్క డైలాగ్ లేదు. తుడిచాక- ప్రేక్షకుల వైపు తిరిగి చేయి చాపి సంభాషణను ప్రారంభిస్తాడు- ఇలాగా!

"జననీ! అవక్ర పరాక్రమోపేతుడైన మగధ భూపతి తనయ యుద్ధవార్తలు విని కంట తడి పెట్టినదన్న యపకీర్తిని మన వంశమునకు రానీయకుము. ఆ నాగాధీశుడెంత? వాని సైన్యమెంత? నన్ను బాలకుడని భావించకుము. మాతులుంగ, లుంగ, లవంగ, చూతకేతకీ, భల్లాటకామ్ర విపినములనైన జొచ్చి, మదీయ బహుజల దర్పముతో ఆ నాగుని వీచమడచి, దంతముల నూడబెరికి, కాలు సేతులు బంధించి నీ పాదముల కడ నుంచనిచో నా జన్మమెందులకు తల్లీ! కాల్పనా? నాగుని కవోష్ణ రుధిరధారలతో నీ పాదాబ్జముల నభిషేకింతునని- ఇదె- ప్రతిజ్ఞ సేయుచున్నడ. 'ఆవంత'ను నీ చెత చేరనీయకుము- ఇదె వెడలుచున్నాడటను. ఓరీ! ఎవడురా అక్కడ? వాయువేగ మనోవేగములనధక్కరించు మదీయ జవనాశ్వమును సుసజ్జితము కావింపుము! నేనిదె వచ్చుచున్నాను. నాగహంతకా! నేటితో నీ చావు మూడినది. కాచుకొమ్ము."

అప్పుడు మహారాణి వారు ఇలాగా అంటారు?

"వీరపుత్రా! నేటికి నా పుట్టువు చరితార్థమయినది. నేను వీరపత్నిని మాత్రమే కాదు, వీరమాతనని నేడే గ్రహించితిని, నీ వంటి శూర, వీర కిశోరము నా తనయుడై యుండగా, 'ఆ-వంత' 'ఆవంత'యు నాదరి చేరదు" అంటుంది.

అంతటితో ఆ సీన్ ముగుస్తుంది.

"ఇలాగే అన్ని సీన్లూ మనం చేయాల్రా! పోర్షన్లు వచ్చాయిగానీ, మాడ్యులేషన్స్ సరిగ్గా లేవు. మూమెంట్స్ కూడా సరిగ్గా లేవు... 'జవనాశ్వమును సుసజ్జితము కావింపుము' అన్నవెంటనే 'వీరపుత్రా! నేటికి నా పుట్టువు' అంటూ మహారాణి గారి సంభాషణ ప్రారంభం కావాలి. అంతేగానీ, 'నేటితో నీ చావు మూడినది. కాచుకొమ్ము' అన్న తరవాత రాణిగారు ఏమీ అనకూడదు. 'కాచుకొమ్ము' అంటూనే రాజకుమారుడు స్టేజీమించీ వెళ్ళిపోతాడు. కనక రాణిగారు డైలాగు 'సుసజ్జితము కావింపుము' అన్న తరువాత ప్రారంభం కావాలి. రాణిగారి డైలాగులో ఆఖరి వాక్యం ఏమిటి? 'నీ వంటి శూర, వీర కిశోరము నాతనయుడై యుండగా ఆ వంత ఆవంతయు నా దరిజేరదు' అనే గదా! ఈ మాటలంటున్నప్పుడు రాజకుమారుడు తల్లి పాదాలకు నమస్కరించాలి. 'దరిచేరదు' అన్న మాట అవుతూ, అవుతూ ఉండగానే 'ఓరి నాగహంతకా! నేటితో నీ చావు మూడినది. కాచుకొమ్ము' అంటూ వెళ్ళిపోవాలి. కొడుకు వెళ్ళినవేపు మహారాణి చూస్తుండగా తెరపడుతుంది" అన్నాడు అప్పారావు.

"సరిగ్గా అలాగే జరగాల్రా!" అన్నాను నేను కూడా.

అప్పారావు కాస్త తేరుకొని, మాడ్యులేషన్ గురించి చిన్న సైజు ఉపన్యాసమిచ్చాడు.

"చూడమ్మాయ్! ఈ సీను రక్తి కట్టడం పూర్తిగా నీ మీదనే ఆధారపడి ఉంది. అన్ని వాక్యాలూ రైలు బద్దీల్లాగా అప్పగించవాకు. గొంతును స్వాధీనంలో ఉంచుకోవాలి. వ్యాక్యాల్ని వొదుగులతో అనాలి. మాట వరసకు చెబుతున్నా. 'ఆవంత ఆవంతయు నా దరిచేరదు' అన్న వాక్యం వేమన పజ్జం లాగా బుడబుడా అప్పగించేశావ్. అది తప్పు మొదటి 'ఆవంత' అనేప్పుడు 'ఆ' తరువాత ఒక అరక్షణం జాగా ఇచ్చి 'వంత' అని అనాలి. ఆః- ఎందుకో చెబుతాను. ఇక్కడ 'ఆ' అంటే 'ఆ యొక్క' అని అర్థం. 'వంత' అంటే విచారం, శోకం, బాధ, సంతాపం, ఏడ్పు, కష్టం, ఇంకా ఇంకా

ఇలాంటివేననుకో; చాలా అర్థాలేడిశాయి. ఇహ రెండో 'ఆవంత' అనేప్పుడు ఒకే వూపున అనాలి గానీ, అక్షరాల మధ్య జాగా ఇవ్వకూడదు. ఈ రెండో దాని అర్థం 'ఆవగింజంత' అని, అంటే, ఆ విచారాన్ని- ఏ విచారాన్నీ- మహారాజు గారు తీవ్రంగా గాయపడ్డారన్న ఆ 'వంత'ను- ఆవంతైనా- దగ్గరకు నానీయను సుమా! అరి మహారాణి అంటున్నది. ఈ తేడా నీవు స్పష్టంగా గొంతులో పలికించాలి. గ్రాపు గీసి చూపించడం నాకు సాధ్యం కాదు- ఏదీ ఒకసారి అని చూడు'' అన్నాడు అప్పారావు.

గుండె అరచేతిలో ఉంచుకొని గుంటూరు కమల అన్నది గానీ, ఆ అనడం నాకే సంతృప్తిగా లేదు.

''బేరాలు చూసుకుంటూ డైలాగ్స్ ప్రాక్టీస్ చేయడం మానుకోకు. వచ్చే దఫా నేను చెప్పినట్టు చేయకపోయావో- నీ చర్మం వొలిచానే!'' అన్నాడు అప్పారావు.

అప్పారావుగారు ఏం వొలిచేది తెలిసిన వాణ్ణి గనక నేనేమీ అనలా. నేనేమీ అనలేదు గనక మిగిలిన వాళ్ళూ ఏమీ అనలా.

* * *

ఇది సుందరం గారి కథ.

చిన్నప్పుడు ఆయన ఏ బాధలు పడితేనేం గానీ, ఇప్పుడు మాత్రం ఆయన కేలోటూ లేదు. ఉత్త చేతుల్తో ఈ పట్నం వచ్చాడు. వచ్చిన తొలి రోజుల్లో ఆయన, ఆయన భార్య కూడా కటిక పస్తులు చేశారని చెబుతారు. ఆయన భార్య కలవారి కొంపలో వంటావార్పూ చేసేదిట. ఆయన గారేమో ఏదో కమీషన్ కొట్లో లెక్కా డొక్కా రాసేవాడట. పది సంవత్సరాలు గిర్రున తిరిగాయో లేదో సుందరం గారు ఉద్యోగం మానేసి సొంతంగా చిన్న వ్యాపారం ప్రారంభించారు. అప్పుడాయన లక్షలకధికారి. చాలా మంది ఆయన కంపెనీలో పని చేస్తున్నారు. సుందరం గారు స్వయంగా ఏదీ పట్టించుకోరు. కానీ, ఏ కంపెనీలో ఎప్పుడు, ఏం జరిగిందీ ఆయనకు తెలిసిపోతుంది.

ఆయన్ది 'లంకంత' ఇల్లు. 'చెట్టంత' పెద్ద కొడుకు ఇప్పుడు అమెరికాలో చదువుకొంటున్నాడు. కూతురుకు కానీ కట్నం ఇవ్వకుండా పెళ్ళి చేశాడు. పెళ్ళయ్యాక అల్లుడికి ఒక కంపెనీలో పావలా భాగం ఇచ్చాడు.

సుందరం గారితో మీ రెప్పుడన్నా మాట్లాడి చూడండి. విసుగు, చిరాకు, కోపం ఎక్కడా కనబడవు. ఆయన మాటలు 'తేనంత' తీయగా ఉంటాయి. ఆయన్ని అడగనివారూ, అడిగి 'లే'దనిపించుకున్నవారూ లేరు.

''అప్పుడెప్పుడో దేవతలూ, రాక్షసులూ పాల సముద్రాన్ని మధిస్తున్న సమయాన కామదేనువు వెలువడిందట. ఈ ఆవు ఎవరేది అడిగితే దాన్ని తక్షణమే ప్రసాదిస్తుందట. మన సుందరంగారున్నారే- అదుగో- ఆ 'ఆవంత' గొప్పవారు'' అని ఆయనకు అంకితమిచ్చిన పుస్తకంలో ఒక కవిగారు రాయను కూడా రాశారు.

అలాంటి సుందరంగారికి ఉన్నట్టుండి ఏం జరిగినా... మనకీ కథతో ఇహ నిమిత్తం లేదు.

వదిలేదాం.

* * *

సంగీతమంటే నాకు అభిమానం లేదన్న వాళ్ళు రౌరవాది నరకాలకు పోతారు.

సంగీతమంటే నాకు వల్లమాలిన ఇష్టం 'కురుక్షేత్రం' నాటకాన్ని నలభై, యాభై సార్లన్నా చూశాను. ఎందుకు చూశానుట? కథ కోసమా? అబ్బే, కాదే! ఒక్కసారి చూస్తేనే తెలిసిపోయిన కథ కోసం అన్ని సార్లు నాటకాన్ని చూడడం శుద్ధ దండగ! ఆ నాటకంలోని పద్యాల కోసం చూశాను. 'బావా! ఎప్పుడు వచ్చితీవు?' అన్న పద్యాన్ని యాభయ్ మందీ యాభై రకాలుగా పాడ్డం నేనెరుగుదును. పొలాన్ని బీడు పెట్టి, నాటకాల కోసం చెడ తిరిగిన రోజులు నాకింకా గుర్తున్నాయి.

అయితే ఈ మధ్య వస్తున్న 'లారల్ప' సంగీతం నా ఒంటికి పడదు. దాన్ని నేను వినలేదు. విన్నా ఆనందించలేదు. ఈ సంగీతంలో గాయకుని గాత్రాన్ని వాద్యాలన్నీ కలిసి దిగమింగి పారేస్తున్నాయి. నేను అర్ధశేరు బియ్యం తిని హరాయించుకోగలిగిన వాణ్ణి. గుప్పెడు మరమరాలు నా ముందు పోసి 'ఆనందించు' అంటే నా వల్ల కాదు. మీరేమన్నా ఆనందిస్తా మంటారా? నాకెలాంటి అభ్యంతరమూ లేదు.

ఆ పాటకచ్చేరీకి రమ్మనమని రెండు రోజులుగా రామ్మూర్తి నా ప్రాణం తోడేస్తున్నాడు. నేను మెత్తబడలా- చెప్పొద్దూ!

''వంద రూపాయలు పోసి రెండు టిక్కెట్లు కొన్నా, పోకపోతే శుద్ధ దండగవుతుంది. వెడదాం రారాదా? నీకు నచ్చితేనే కూచుందాం. ఇనప సంగీతమయితే మనం లేచొచ్చేదాం. చాలా గొప్పగా పాడాడు'' అన్నాడు రామ్మూర్తి, నా బలహీనతలమీద నొక్కుతూ.

'సరే' అన్నాను గతిలేక.

నే నెంత అయిష్టంగా వెళ్ళానో అంతగా కుర్చీకి అతుక్కుపోయాను. శంకరాభరణం ప్రారంభిస్తూనే సుబ్రహ్మణ్యయ్యర్, నన్ను దేవలోకాల్లోకి తీసుకుపోయాడు. రామ్మూర్తి అసలీ ప్రపంచంలోనే లేడు. గాయకునితో బాటుగా వాడూ తల తిప్పడం, 'ఆహా-ఓహో' అనడం చూసిందాకా మా రామిగాడు ఇంతగా సంగీతాన్ని ప్రేమిస్తాడని నాకు తెలీదు.

రాగసంచారం పూర్తి చేసి, పల్లవి చరణాలు అలా అని, వాద్య గాళ్ళకు కాస్త బాగా ఇచ్చాడు సుబ్రహ్మణ్యయ్యర్.

ఏదో 'కీచు'మంటూ చెవిని చీల్చుకుపోయింది.

''చ, చ. ఇహ పోదాం పదరా!'' అన్నాడు రామ్మూర్తి కసకసలాడుతూ.

''అప్పుడే?'' అన్నాను.

''ఒక్క క్షణం ఉండను. బాబోయ్! 'ఆ వంత'ను భరించడం నా వల్ల కాదు'' అన్నాడు రామ్మూర్తి.

నా చెవి ఎందుకు చీల్చుకుపోయిందో అప్పుడు తెలిసింది.

సుబ్రహ్మణ్యయ్యర్ పాయసం లాంటివాడైతే, 'ఆ వంత'పలుగురాయి.

వంత పాటగాణ్ణి- కాస్త మంచిగా పాడే వాణ్ని సుబ్రహ్మణ్యయ్యర్ ఎందుకు చూసుకోలేక పోయాడో నాకింత వరకూ తెలీదు.

* * *

ఈ పరంపరలో రావలసింది మరోటి కూడా ఉంది. తిమ్మయ కవి రాసిన 'అచ్చ తెలుగు రామాయణం'లోని ఒక పద్యం-

"కరకు జూపక, 'వంత'లు గనక నెత్త
మునబొరలు, పెనుబాముల మొగినలగక
వేల్పుదొరకైన వెరవక వెలయు నచటి
పుడమి తాలుపు గమి హెచ్చుబొగడ వరిది-"

ఈ 'వంత' వేరు. దీని అర్థం "ఏరు- పేర్చు- సేకరించు-పోగుచేయి" వగైరా వగైరాలు.

అయ్యా! అమ్మా!

"దీనికి అంత మెక్కడ?"

"ప్రస్తుతానికిక్కడ!"

--0--

# ప్రకటించిన కార్యక్రమానికి బదులు...

**...మ**రొకటేదో సర్దేయటం పెద్ద కష్టమేమీ కాదుగానీ- అలా "సర్దుకుపోవడ" మున్నదే- ఆ కార్యక్రమ నిర్వాహకుని అజాగ్రతకూ, అలసత్వానికీ చిహ్నమని మనం మరచిపోకూడదు.

ప్రకటించిన కార్యక్రమం, ప్రకటించినట్లుగా జరిగితే ఎవరూ చెప్పుకోడానికేమీ ఉండదు. మహా అయితే ఈ కార్యక్రమం తాలూకు బాగోగుల్ని గురించి కాస్సేపు కబుర్లాడుకోవచ్చు. కానీ అన్నిసార్లూ, అనుకొన్నవి అనుకొన్నట్లుగానే జరగవు... అల్లాగా జరగనప్పుడు ఒక్కొక్కసారి నానా రభసా అవుతుంది...

ఈ సందర్భంలో నా చిన్నప్పటి సంగతులు ఒకటి రెండు గుర్తుకొస్తున్నాయి. ఆ రోజుల్లో రంగస్థల నాటకాలకు మాంచి గిరాకీ ఉండేది. అద్దంకి, దొమ్మేటి, అబ్బూరి, సూరిబాబు, సియస్సార్, తుంగల, సవరం, వేమూరి వంటి మహానటులూ; పూర్ణిమ, తిలకం, శ్రీరంజని, సభారంజని, రాధాబాయి, కృష్ణవేణి వంటి నటీమణులూ, జనం నోళ్ళలో నానుతూ ఉండేవారు.

గయోపాఖ్యానం, పాదుకాపట్టాభిషేకం, సత్యహరిశ్చంద్ర ఉద్యోగ విజయాలు, తారా శశాంకం, కృష్ణ తులాభారం, రామదాసు, సతీ సక్కుబాయి, భక్త శ్రీయాళ, చింతామణి, నందనార్ వంటి నాటకాలను ఊరూరా, వాడవాడా ప్రదర్శించేవారు.

చిత్రమేమిటంటే- ఈ నటీనటులందరిదీ ఒక ఊరు కాదు, ఒక జిల్లా కూడా కాదు. నాటకం ఆడించదలుచుకొన్నాయన- వీరందరి దర్శనమూ చేసుకొని, ఫలానా నాటకం ఆడవలసి ఉంటుందని వీరందరికీ చెప్పి, సగం డబ్బు అడ్వాన్సుగా ఇచ్చి, మిగిలిన సగం- రంగు వేసుకోడానికి ముందుగానే చెల్లించుతానని హామీ ఇచ్చి వచ్చేవాడు.

ఈలోగా హాలు మాట్లాడుకోవడం, చుట్టుపక్కల పది ఊళ్ళలో డప్పుడు పెట్టి ప్రచారం చేయడం, గోడలకు కాగితాలు అంటించడం, ఒంటెద్దు బండి మీదనో, గుఱ్ఱబ్బండిమీదనో ఊళ్ళన్నీ తిరిగి, కరపత్రాలు పంచడం- ఫలానా ఫలానా వారి దగ్గర టిక్కెట్లు దొరుకుతాయనడం- ఇదంతా ప్రచారానికి సంబంధించిన తంతు.

అనుకొన్న వేళకు, అనుకొన్న నటీనటులందరు వస్తే- కాంట్రాక్టర్ గారు నిబంధనల మేరకు ముందుగానే డబ్బు చెల్లిస్తే- నాటకం పది గంటలకు ప్రారంభమయితే- తెల్లవారు జామున, ఏ నాలుగ్గంటలకో ముగిసేది. నాటకం చూశాక కాస్త కలిగినవారి ఇళ్ళకెళ్ళి పడుకునేవారు. నాలాంటి వారు, అటునించి అటే పొలం పోయేవారు.

నాకింకా బాగా గుర్తు- మా నాన్నగారికీ నాటకాలంటే వెర్రి వ్యామోహం. ఆయనతో బాటు- విధిలేక- నేనూ కొన్నింటికి హాజరవుతూ ఉండేవాణ్ణి. అప్పటికీ యిప్పటికీ నాటక రసాస్వాధనం చేయలేకపోవడం నా దురదృష్టం! గోనె పట్టాల దిక్కుగా వేలు చూపిస్తూ-

''అదిగో ద్వారక, ఆలమందలవిగో, అందందు గోరాడు నయ్యెదియే కోట, అదే యగడ్త...'' అని ఏ మహానటుడు పాడుతున్నా, అది ద్వారక అనీ, ఆ పక్కని ఆలమందలనీ, అనుకోవడం నాకు చేతకాదు.

ఓ దొప్ప ముఖం చింతామణిని చూసస్తూ ''వదనము చంద్ర బింబము బాతి మిసమిసలాడుచున్న ఈ ఎలనాగ సౌందర్యముననుభింపని వారి జన్మ - జన్మయా? హతవిధీ!'' అని, ఓ బిల్వమంగళుడో మరో భవానీశంకరుడో ఎలా అనగలుగుతారో నాకిప్పటికీ అర్థం కాదు.

వెదురు బొంగుల రంగస్థలాన్ని చూపుతూ ''పాచిపట్టిన యట్టి పాషాణ స్థలమిది, యడుగులు మెలమెల్లనిడుగవలయు, ఇపుడిపుడే కోసి, రీయెడ దర్భల ముందు జూసి పదంబు మోపవలయు'' అని, సత్యవంతుడు, ఆనంద భైరవిలో, సావిత్రికి చెబుతుంటే- మా నాన్నగారు ''ఓహ్హో! ఆహా'' అనే వారుగానీ నాకు మాత్రం నవ్వుగానే ఉండేది!

ఆ తరువాత ఎప్పటికో గానీ, నాకు బోధపడింది కాదు- నాటకం అనేది ''అనుకోవడం'' అన్న మానసిక క్రియ మీద పూర్తిగా ఆధారపడి ఉంటుందని! పూర్ణిమను చూసి, ఓసారి 'తార' అనుకోవడం, మరోసారి 'చంద్రమతి' అనుకోవడం, ఇంకోసారి 'సత్యభామ' అనుకోవడం- అద్దంకిని చూసి ఓసారి 'శ్రీరాముడు' అనుకోవం, ఇంకోసారి 'హరిశ్చంద్రుడు' అనుకోవడం, మరోసారి

'ధర్మరాజు'అనుకోవడం-అప్పయ్యగారి పశువులకొట్టాన్ని 'దేవి మహల్' అనుకోవడం, గళ్ళదుప్పటి సందును, 'హస్తినాపురి రాజవీధి' అనుకోవడం- నీకు చాతకాక పోతే; నాటకాన్ని నువ్వు ఎంజాయ్ చెయ్యలేవు.

సరే-

ఇప్పటికే నేను, జపం విడిచి లొట్టల్లో పడ్డాను- మరో చిన్న సంఘటనను మనవి చేసి, అసలు విషయానికొస్తున్నాను. ఆరోజుల్లో ఒక్కో నాటకంలో, ఒక్కో పాత్రను, ఇద్దరేసి, ముగ్గురేసి చొప్పున నటిస్తూ ఉండేవారు. ఉద్యోగ విజయాల్లో , మొదటి కృష్ణుడు, రెండో కృష్ణుడు, మూడో కృష్ణుడు, నటించడం నాకు తెలుసు. ఇద్దరు హరిశ్చంద్రులు, ఇద్దరు అర్జునులు, ముగ్గురు సత్యభామలూ, పోటా పోటీల మీద నటించడం, నాకు తెలుసు. ఒకటి రెండు నిమిషాల్లో ముగిసిపోవలసిన పద్యాన్ని, పావుగంట దాకా ఝామ్మని పాడటం, పురజనుల కోరిక మీద, రెండేసి, మూడేసి దఫాలు, రకరకాల రాగాల్లో అదే పద్యాన్ని పాడటం- నాకింకా గుర్తున్నది.

పోనీండి-

నా నాటకాల అనుభవాలను, మరోసారి మనవి చేసుకొంటానని మనవి చేస్తూ ప్రస్తుతానికొస్తున్నాను.

ఓసారి-

అమరావతిలో ఉద్యోగ విజయాలాడుతున్నారు. అందులో ముగ్గురు కృష్ణులున్నారు. ఏ కారణం వల్లనో, ఇద్దరు కృష్ణులు రాలేదు. ఈ సంగతి జనానికి తెలిసి, అల్లరి చేయటం ప్రారంభించారు. ''ముగ్గురు కృష్ణులతో నాటక మాడిస్తానని ఎందుకు ప్రచారం చేశా''వని కాంట్రాక్టర్‌ను నిగ్గదీశారు జనం.

ఆఖరికి, ఆ వొక్క కృష్ణునితోనే పూర్తి నాటకమాడిస్తాననీ, అల్లరి చేయొద్దనీ, కాంట్రాక్టర్, కళ్ళావేళ్ళా పడ్డాక జనం చల్లబడ్డారు. కానీ ఈలోగా ఒకటో నెంబరు కృష్ణుడు, రణ పేచీ వేసుక్కూచున్నాడు. ''నాకిచ్చిన అడ్వాన్సు, మూడో వంతు నాటకంలో వేషం వేయడానికే గానీ, మొత్తం నాటకానిక్కాదు గనుక, నేను నటించవలసిన అవసరంలే''దన్నాడు. బండి కుదిరిస్తే వెడతానన్నాడు. కుదర్చకపోయినా- క్షణం పాటయినా, ఉండనన్నాడు. ''మిగిలిన ఇద్దరికీ ఇవ్వాల్సిన కిరాయీ నీకే ఇస్తా''నన్నా, ఆ నటుడు వొప్పుకోలేదు. ఆఖరికి బ్రతిమాలీ, బామాలీ, అతన్ని వొప్పించారు! రెట్టింపు కిరాయి తీసుకొనే షరతుకు వొప్పుకొని- మొత్తం నాటకాన్ని ఊదిపారేశాడా మహా నటుడు!

నాటకం బాగానే జరిగింద. కానీ- ప్రేక్షకులు ఆ హాలును, ఫర్నిచర్నీ ధ్వంసం చేశారు. ఆ దెబ్బతో, ఆ కాంట్రాక్టర్ తన కళాభిరుచికి విడాకులిచ్చి, తవుడుకొట్టుపెట్టుకొని, వేలు సంపాదించాడు. ప్రకటించిన కార్యక్రమం, ప్రకటించినట్లుగానే జరిగితే- ఆ కళాహృదయుడు, ఇంకెన్ని నాటకాలాడించి- కళామయం చేసేవాడో మనం అంచనా వేయలేం. అయితే- ఆర్థిక పరంగా- అతనిప్పుడున్నంత స్థిమితంగా మాత్రం అప్పుడు ఉండేవాడు కాదు.

ఫలానా తేదీన, ఫలానా చోట, ఫలానా పథకానికి ప్రారంభోత్సవమని ప్రకటిస్తారు. ఫలానా వారు అధ్యక్షులు, ఫలానా వారు పూజ చేస్తారు. ఫలానావారు కత్తెర అందిస్తారు. ఫలానా ఫలానా వారు - రిబ్బను కత్తిరిస్తారు, పొరుగు రాష్ట్రం నుంచి వచ్చే ఫలానా వారు, ఈ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా విచ్చేస్తారు- ఇదీ ప్రకటించిన కార్యక్రం.

అన్నీ సక్రమంగా జరిగితే- అంతకన్నా కావల్సిందేమీ ఉండదు. కానీ అధ్యక్షులవారు సమయానికి రారు- ''ఇదిగో వస్తున్నారు- అదిగో వస్తున్నారు- బయలుదేరబోతున్నారు- బయలుదేరుతున్నారు- ఇప్పుడే కాదు తలుపులు వేశారు- హమ్మయ్య- కారు వెళ్ళిపోయింది...'' అని కబుర్లు. కానీ- ఆ కారు ఎంతకీ రాదు. విసుగు, చిరాకు, ఆందోళన- కానీ ఇవేవీ పైకి అనడానికుండదు. ముఖంలో చూపించడానికుండదు. అలా ఎదురు చూసి చూసీ, చూసి- ఇహ నిలబడలేక, కూచోలేక- ఇటూ ఇటూ కాకుండా - వరగబడతారు కొంతమంది!

పురోహితుడు పెట్టిన ముహూర్తం దాటిపోయి, అప్పటికే మూడు గంటల పై చిలుకు అయి ఉటుంది. అప్పుడు తెలుస్తుంది కార్యక్రమ నిర్వాహకులకు, చావు వార్త చల్లగా! అధ్యక్షుల వారు, హఠాత్తుగా మరో అర్జంటు పనిమీద ఎక్కడికో వెళ్ళారనీ ఎప్పుడొస్తారో కూడా తెలీదనీనూ, పొరుగు రాష్ట్రపు పెద్ద మనిషి ధుమధుమ లాడినప్పటికీ ఎవరి చేతులు వారే పిసుక్కోవడం తప్ప ఎవరు చేయగలిగిందేమీ ఉండదు. ప్రారంభోత్సవ కార్యక్రమం కాస్త ఆలస్యంగానైనా ప్రారంభిం చడమా? లేక మరోనాటికి వాయిదా వేయడమా? సులభంగా జవాబు దొరకని అనేక చిక్కు ప్రశ్నల్లో ఇదొకటీ!

ప్రణాళికా రచనా సంఘం వారు దేశాభ్యుదయం కోసం అనేక కార్యక్రమాలను ముందుగా ప్రకటిస్తారు. భారీ నీటిపారుదల పథకాలు; మధ్య తరహా, చిన్న తరహా సాగునీటి పథకాలు; గ్రామ ప్రాంతలలో రోడ్ల నిర్మాణం; గ్రామీణ ప్రాంతాలకు మంచినీటి సరఫరా; వరద నిరోధక పథకాలు; గృహ నిర్మాణ కార్యక్రమాలు; ఉక్కు, ఇనుము పరిశ్రమలు; ఎరువులు, రసాయనాలు ఔషధాలు: వైద్య, ఆరోగ్య కార్యక్రమాలు; సాధారణ విద్య, సాంకేతిక విద్య; హరిజన, గిరిజన సంక్షేమం; విద్యుదుత్పత్తి, సహకార రంగం, రోడ్లు, భవనాల నిర్మాణం; రవాణా సదుపాయాల కల్పన; అణుశక్తి- అంతరిక్ష పరిశోధనలు; మొదలైన సంక్షేమ కార్యక్రమాలను వారు ప్రకటిస్తారు.

ఈ ప్రకటించిన కార్యక్రమాలు- యధాతథంగా అమలు జరగడం లేదని- అప్పుడప్పుడు వింటుంటాం.

తొట్టతొటిగా ప్రకటించిన కార్యక్రమానికి బదులు- మరో కార్యక్రమం ఆకస్మికంగా ప్రత్యక్షమవడం కూడా తెలుసు. దేశం మొత్తానికి సంబంధించిన కార్యక్రమాల్లో మార్పులూ చేర్పులూ ఎటుగూడీ తప్పవనుకోండి. కానీ, వ్యక్తిగత విషయాల్లో కూడా- ఏదో వో రూపంలో ఈ 'బదులుగా' అన్న కార్యక్రమం తప్పడం లేదు.

మీ అబ్బాయి చదువును గురించో, మీ అమ్మాయి పెళ్లిని గురించో ఓ భారీ కార్యక్రమాన్ని ఉత్సాహంగా ముందు ప్రకటించారనుకోండి. అనుకొన్నట్లుగా, అబ్బాయిగారు అన్ని పరీక్షల్లోనూ,

అలవోకగా ఉత్తీర్ణుడు కాలేదనుకోండి. ఒక్కోక్లాసులో రెండేసేళ్ళు పీఠం వేశారనుకోండి. మీరు ఉ ద్యోగ విరమణ చేసే వేళకు, యువరాజావారింకా మెట్రిక్ గణపును దాటలేదనుకోండి- అప్పుడు అబ్బాయి పరంగా, మీరు లోగడ ప్రకటించిన కార్యక్రమానికి బదులు... ఇంకేదో చేయక తప్పదు.

అవునా?

అలాగే!

మీ అమ్మాయికి సంబంధం కుదురింది! కట్నాలు నిషేధం గనుక, మీ కాబోయే వియ్యంకుడు కట్నం అడగరు. కానీ- ఓ స్కూటరు మాత్రం- అడుగుతాడు. అమ్మాయికి బాల తొడుగుల కింద "ఇంత బంగారం" ఉండాలని నిక్కచ్చి చేస్తారు. మీరూ 'సరే' నంటారు. తీరా లగ్నం వేళకు, మీరు కొందామనుకొన్న బంగారం ధర మీకందుబాటులో ఉండదనుకోండి- స్కూటర్ ధర వేల మీద పెరిగిందనుకోండి! అప్పుడు- మీరు లోగడ ప్రకటించిన భారీ కార్యక్రమానికి బదులు-ఇంకోటేదో, సవరింపులతో కుదింపులతో, ఏర్పాటు చేసుకొంటారా లేదా? ఈ సవరింపుల వల్లా, కుదింపులవల్లా, పెళ్ళిపందిరి రణరంగంగా మారుతుందా లేదా? ఈ కారణాల వల్లనే పీటలమీద పెళ్ళిళ్ళు కూడా చెడిపోయిన దాఖలాలున్నాయా లేదా?

"ప్రకటించిన కార్యక్రమం, ప్రకటించిన విధంగా- అక్షరాల అమలు జరిపిందాకా- మీ అమ్మాయిని మీ దగ్గరే ఉణ్ణీండి" అన్న అల్లుళ్ళను, తమరు చూశారా లేదా?

ఇవేవీ అపురూపమైనవీ కాదు, అసంభావ్యమైనవీ కాదు. ఇందులో ఏ ఒక్కరి చిత్త శుద్ధినీ మనం శంకించవలసిన అవసరం లేదు.

ఎందుకంటారా?

మాట వరసకు మీ సంగతే తీసుకొందాం-

ఇవ్వాళ మీ వివాహ దినోత్సవం. ఈ పండగను బ్రహ్మాండంగా జరుపుకొందామని- గత వారం రోజులుగా మీ దంపతులిద్దరూ రకరకాల కార్యక్రమాలనూ తయారు చేసుకొన్నారు. అందులోనూ - తొలి వార్షికోత్సవం గనుక- మీ ఉత్సాహం వదర లెత్తి దరులొరసి పారుతూ ఉంటుంది.

రోజూ మాదిరిగా పొద్దెక్కి లేవకుండా- అలారం పెట్టుకుని- కాస్త కనుచీకటి ఉన్నప్పుడే లేవడం- ఒకరి కళ్ళల్లోకి మరొకరు చూచుకొంటూ- కాఫీ తాగటం- తరువాత స్నానం- దేవాలయానికి వెళ్ళడం- వచ్చే ఏడాది కన్నా గుమ్మడి పండులాంటి బుజ్జి నాన్న కావాలని మొక్కుకొనడం; ఇదీ ఉ దయం పూట కార్యక్రమం! ఆవిడేమో మీరు పదే పదే ముచ్చటపడే వెడల్పంచు కంచి పట్టుచీరె కట్టుకుంటాననీ, నీలం రంగు జాకెట్టు వేసుకొంటాననీ, పెళ్ళినాటి నగల్లో- తాకట్టులో ఉన్నవి గాక- మిగిలిన వాటిని వేసుకొంటాననీ అన్నది. మీరేమో బుగ్గన సాదుచుక్క కూడా పెట్టుకోమన్నారు. మీ చేత బతిమిలాడించుకొందామన్న సదుద్దేశంతో, మీ ఆవిడ - చప్పున ఇందుకు వొప్పుకోలేదు. దీనికి బదులుగా- సదస్యమప్పుడు మీరు వేసుకొన్న సూటునే వేసుకోమని ఆవిడ కోరింది. బుగ్గ చుక్కను ఓ నిమిషం పాటు అద్దంలో చూసుకొనే దాకా ఉంచుకొని ఆ తరువాత తుడిచివేసే షరతు మీద మీ

ఆవిడ వొప్పుకొన్నది. మీరూ మెత్తబడి 'సరే'నన్నారు.

ఈ పూట వంట మానేశారు. అసలు మీకు ఆకలే కాలేదు... నిన్న చేసిన స్వీట్స్ తిని, కాఫీ తాగి, షాపింగ్ కెళ్ళి- పార్కులో ఓ మూలగా కూచుని, తియ్యని కబుర్లాడుకొని, ఎనిమిదింటికి హొటల్లో భోజనం చేసి రెండో ఆట సినిమా చూదామని అనుకొన్నారు. ఆటో రిక్షాలో కాకుండా- మామూలు రిక్షాలో, వొదిగొదిగికూచుందామనీ, గతుకులొచ్చిన ప్రతిసారీ, అవసరాన్ని మించి ఆమె కేసి వొరుగుదామనీ, మీ మట్టుకు మీరనుకొన్నారు.

ఈ రిక్షీ వ్యవహారం తప్ప మిగిలినవన్నీ, ఇలా - ఇలా- ఇలా జరగాలనీ, జరుపుకొందామనీ, మీరో కార్యక్రమాన్ని తయారు చేసుకొన్నారు. దీన్ని అక్షరాలా అమలు జరపడం కోసం- మీరీ రోజున సెలవు కూడా పెట్టారు.

కాని- ఏం లాభం?

నిన్న సాయంత్రం మీ సెలవును మంజూరు చేసిన ఆఫీసరుగారే మిమ్మల్ని అర్జంటుగా, ఆఫీసుకు పిలుచుకురమ్మని మనిషిని పంపించారు. ఆ వచ్చిన వాడికి, రెండో మూడో ఇచ్చి, 'ఇంట్లో లే'రని చెప్పించుదామని కూడా మీరు చూశారు. వాడో జిడ్డు వెధవ, మిమ్ముల్ని వదల్లేదు. ఇప్పుడు చెప్పండి! అందులో మీ నిజాయితీని శంకించడానికేమన్నా ఆస్కారం ఉన్నదా? లేదుకదా!

ఇదే విధంగా-

మనం ఎంతో చిత్తశుద్ధితో, ప్రకటించిన ఓ కార్యక్రమానికి బదులు "అనివార్య కారనాల" వల్ల- అప్పుడప్పుడు మరో కార్యక్రమాన్ని చేపట్టక తప్పదు. ఇలా జరగడం- నిజంగా దురదృష్టమే! దాదనను!!

మన పూర్వజన్మ సుకృత విశేషం వల్లా, మన పితృదేవతల ఆశీర్వచన బలం వల్లా- "అనివార్య కారనాలు" అన్న వాక్య మొకటి అడుగడుగునా, మనల్ని ఆదుకోబట్టి గానీ, లేకపోతే ఈ బదులుగా వచ్చే కార్యక్రమాలను సమర్థించడానికి, మనకున్న సమయం- ఎంత మాత్రం సరిపోదు.

చివరగా ఒక్క మనవి.

ఇదీ-

"ప్రకటించిన కార్యక్రమానికి బదులు"గా ప్రసారమవుతున్న కార్యక్రమం కాదనీ, దీని శీర్షిక ఇదేననీ గ్రహించండి! చాలు! దయచేసి నా చిత్తశుద&ఇధని మాత్రం శంకించకండి!!

--0--

# తేనీరు

## అమ్మతోడు!

భగవంతుని సాక్షిగా చెబుతున్నా! నా మాట నమ్మండి. 'టీ' అన్న ఇంగ్లీషు మాటను 'తేనీరు' అని అనువదించిందెవరో నాకు తెలీదు. అసలు ఇంగ్లీషు మాటకు 'తేనీరు' అన్న అనువాదం, సరయిందో కాదో కూడా నాకు తెలీదు.

అయితే--

'తేనీరు' అన్న మాటను నేను వినడం ఇదే మొదటి సారి కూడా కాదు. ఎప్పుడెప్పుడు విన్నానో, ఎక్కడెక్కడ విన్నానో తమకిప్పుడు మనవి చేసుకొంటున్నాను- వినండి!

నా చిన్నప్పటి సంగతిది-

అప్పటికి నాకు పదేళ్ళో, పన్నెండేళ్ళో గుర్తు లేదు. ఏవో సెలవులొచ్చాయి. తాతగారింటికొచ్చాను. అప్పుడప్పుడే లోకం లోకి కళ్ళు తెరుస్తున్నాను. తర -తమ - భేదాలు కొద్ది కొద్దిగా, ఆకళింపు కొస్తున్నాయి. ఆగర్భ శ్రీమంతులకూ, ఆగర్భ దరిద్రులకూ మధ్య తేడాలున్నాయని, కాస్త కాస్తగా తెలుస్తూ తెలుస్తూ ఉంది. నా ఎదురింటి వారబ్బాయి, ఫుల్ పాంట్ వేసుకొంటే, నాకు సగం షరాయిని, మా అమ్మ కుట్టించడం, గుడ్డ ఖరీదు భరించలేకనే అని- అప్పుడు నాకు తెలీదు. నాతో బాటు సగం షరాయిలూ, పావు షరాయిలూ తొడుక్కున్న వారూ ఉండేవారు. అసలే షరాయీ లేకుండా, మురికి గోచీ పెట్టుకొని తిరిగే వారూ చాలా మందే ఉండేవారు. ఎందుకలా ఉండేవారో నన్న ప్రశ్న, నాకప్పుడు కలగలేదు. ఒక వేళ కలిగే ఉంటే- నేను ఏ సమాధానం చెప్పుకొని ఉండేవాణ్ణో ఇప్పుడు ఊహించడం కూడా నాకు సాధ్యం కాదు.

మా తాతగారి ఊరొచ్చానని చెప్పాను గదూ? అప్పుడు- నాకు పదేళ్ళో, పన్నెండేళ్ళో కూడా సరిగ్గా గుర్తు లేదని సైతం చెప్పానుగదూ?

మాదేమో ఐదు దూలాల పెంకుటిల్లు, వెనక పెరడు- కాస్తే ఉండేది గానీ, ముందు- బాగా, ఖాళీ జాగా ఉండేది. ఓ పెద్ద రాతి రోలు, దాని వొంచనే మునగ చెట్టూ, ఆ చెట్టుకు అల్లంత దూరంలో గిలకల బావీ- మీరు నమ్మండి! ఆ వీధి మొత్తం మీద, సొంత బావి ఉన్న వాళ్ళం మేమే! ఆ వీధి వారందరూ, మా బావి నించే నీరు తోడుకుపోతూ ఉండేవారు. కందెన తగ్గినప్పుడల్లా- ఆ దిక్కుమాలిన ఇనప గిలక- కీచుమంటూ గోలకెత్తేది. కాస్సేపు దాని గోలను విని, ఆనందించి, ఎక్కణ్నించి, ఆ శబ్దం వొస్తుందో- పనిగట్టుకొని చూసి- అమ్మో, నాన్నో కోప్పడ్డాక, ఆ గిలక మొఖాన ఇంత నూనె పోసి, దాని గోల తగ్గించి, ఇవతలికొచ్చయ్యడం నాకింకా గుర్తున్నది.

ఇంతకీ చెప్పొచ్చిందేమిటంటే- మా తాతగారింట్లో బావి లేదు. ఆ ఇంటికి అయిదారిళ్ళవతలి నించి, మా తాత కావిడితో నీళ్ళు తెచ్చి పోస్తుండేవాడు. ఆయనగారు, ఏ కూలి పనికో, నాలిపనికో వెళ్లినప్పుడు మా అమ్మమ్మ గారు నీళ్ళు తెస్తూ ఉండేది.

అవిణ్ను మీరెరుగరు. ఎప్పుడన్నా చూపెడదామన్నా- ఆవిడ ఫొటో లేదు. ఆవిడ పచ్చగా ఉండేది. పచ్చి పసుపు కొమ్ము రంగులో ఉండేది. పొట్టిగా ఉండేది. జుట్టు చిరాగ్గా ఉంగరాలు తిరిగి ఉండేది. కాళ్ళగ్గానీ, చేతులగ్గానీ, ఏ సొమ్ములూ లేవు. ఆవిడ మెళ్ళో తాలిబొట్టు చూసిన గుర్తు కూడా నాకు లేదు. ఎప్పుడూ- ఓ పసుపుకొమ్ము మాత్రం వేళ్ళాడుతూ ఉండేది. ఎప్పుడూ చిరిగిన చీరెలో, మాసిక లేసిన చీరెలో కట్టుకొంటూ ఉండేది. బక్కగా ఉండేది. రవంత వొంగిపోయి ఉండేది. అతి కష్టం మీద అడుగుతీసి అడుగులేస్తూ ఉండేది. ఎముకల మీద చర్మం ముసుగేసినట్టుగా ఉండేది.

నేనంటే సుబ్బమ్మవ్వకు వల్లమాలిన ప్రేమ. నడిచేప్పుడు కూడా నా మీంచి చెయ్యి తీసేది కాదు. అవసరమున్నా లేకపోయినా, నాకు జుత్తు సవరిస్తూ ఉండేది. అవసరమున్నా లేకపోయినా, నాకు చెమట తుడుస్తూ ఉండేది. అవసరమున్నా లేకపోయినా, నా చొక్కాను ముందుకూ, వెనక్కూ సర్దుతూ ఉండేది.

"నామనవడే తిరపతమ్మా! మా పెద్దమ్మాయి కొడుకు. నిన్ననే వచ్చాడు. ఎన్నో తరగతోనమ్మా- చదువుకొంటున్నాడు. ఒరేయ్ నాయనా! ఒక పజ్జెం చదవరా?" అనేది సుబ్బమ్మవ్వ నాకేసి గర్వంగా చూస్తూ.

నాకొచ్చిన పజ్జాలేవో దంచి పారేసేవాణ్ణి.

ఊరేమో చిన్నది! బొడ్డురాయి కవతల పది కొంపలు కూడా ఉండవు. ఆ చెరువు కట్టమీద రావిచెట్లూ, జువ్విచెట్లూ ఎప్పుడూ గలగల్లాడుతూ ఉండేవి. కింద పడ్డ రావి ఆకుల్ని వొడుపుగా మడిచి, బూరలు చేసిస్తూండేది సుబ్బమ్మవ్వ. 'గయ్ గయ్'మని, చెవులు దిబ్బళ్ళు పడేలాగా ఊత్తూ ఊత్తూ, నేనూ- నా చేత ఊదిస్తూ ఊదిస్తూ సుబ్బమ్మవ్వ, ఆ పూట పది గడపలైనా ఎక్కి దిగి ఉంటాం. నన్ను వాకిట్లోనే ఉంచి, సుబ్బమ్మవ్వ, ఆ ఇంటావిడతో, ఏదో గుసగుసలాడేది. తరువాత, బిక్కచచ్చిన ముఖంతో నా చేయి పుచ్చుకొని, మరో ఇంటి గడపెక్కేది.

ఆఖరికి నాకు తెలిందేమిటంటే- నేనొచ్చాను గనక- ఆ పూట 'ఆ బువ్వ' వొండి పెడదామని సుబ్బమ్మవ్వ ఉద్దేశమూ- అని! ఏ సజ్జన్నమో, జొన్నన్నమో కావాలంటే- తనకీ బదవలే అవసరం లేదట. తను వెళ్లిన, ఆ పది ఇళ్ళ దగ్గర తప్ప- ఇంకెక్కడా - బియ్యపు గింజలు దొరకవట. అందుకనే- తను తిరిగిందట.

"తిరపతమ్మ గారి వసారాలో, బియ్యం నేను చూశాగదా? తీసుకు రాకపోయావా అమ్మమ్మా?" అన్నాను.

అమ్మమ్మ ఇంకోసారి నా జుత్తు సర్ది "తే నీరు బాబూ!" అన్నది మెల్లగా, తనలో తను గొణుక్కుంటున్నట్లుగా.

"తే నీరు" అన్న మాను- అదుగో అప్పుడూ- నేను తొలిసారిగా విన్నది. అక్కడేమో, అన్ని బియ్యం కుప్పగా ఉండె- ఇక్కడేమో, చారెడు బియ్యం అవసరమూ ఉండె- ఈ అవసరానికి, ఆ చారెడు బియ్యమూ, ఎందుకు తేనీరో ఇప్పుడు నాకు తెలుసుగానీ, అప్పుడు తెలీదు.

అది ఎండాకాలమా! పడమటి శాంబరం, ఈ చెవిలోంచి, ఆ చెవిలోకి ఈడ్చి కొడుతోంది. కొమ్మ కదలడం లేదు. రెమ్మ మెదలడం లేదు. శిరస్సు నుంచి చిరుపాదం దాకా- ఒకటే చెమట- దిగచెమట.

దానికి తోడు- సుబ్బమ్మవ్వ, పొయి నిండా కంది మోళ్ళు కుక్కింది. పొయిమీద కుండా, కుండలో సజ్జకుడుములూను. పొయికి అటూ ఇటూ పొంత కుండలు. కంది మోళ్ళ సెగకు, కుడుములూ ఉడకాలె. పొంతకుండల్లో నీళ్ళూ కాగాలె! ఆ సాయంత్రం నాకు తలంటి పోస్తానంది సుబ్బమ్మవ్వ. అందుకని, నిన్ననే డొంకలకెళ్ళి, వొడినిండా- తంటెపుగింజలు తీసుకొచ్చాం. రాత్రి వాటిని నానేసింది. ఉదయం మజ్జిగ బోసి మెత్తగా రుబ్బింది. ఇదిగో- ఈ సజ్జ కుడుముల వాయి దించేశాక- స్నానం చేయిస్తానంది.

సరిగ్గా ఆ సమయంలో వచ్చాడు మా తాత ఆపసోపాలు పడుతూ. వస్తూనే, వసారా గుంజకు వారగిల బడ్డాడు. పడుతూనే, 'అసేయ్' అని నీరసంగా కేకేశాడు.

సుబ్బమ్మవ్వ- మసి చేతిని- అసలే మసిగా ఉన్న చీరెకు పులుముకొంటూ ఆదరాబాదరా వచ్చింది.

''తే - నీరు' అన్నాడు తాతయ్య నీరసంగానూ, ఆవురావురు మంటూనూ!

తాతయ్య భుజం మీది ఖాళీ ఉత్తరీయాన్ని చూసి- కళ్ళొత్తుకొంటూ, మంచినీచ్చింది సుబ్బమ్మవ్వ.

'తే- నీరు' అన్న మాటను, నేను రెండోసారి విన్న సందర్భం అదీ!

ఇదే మాటను నేను మూడోసారి విన్నది- సుమారుగా నాలుగైదేళ్ళ కిందట.

సీమ చింత పల్లెను మీరు చూశారో లేదో గానీ, నేను చూశా. ఆ ఊరికి అల్లంత దూరంలో కొండలున్నాయి. వాటిని తేమ గుట్టలంటారు. ఆ గుట్టలో మధ్యనించి, ఓ ఊట వాగు ఊరికి ఎడంగా, పొలాల మధ్యగా పారుతూ ఉంటుంది. ఆ కాలం, ఈ కాలం అనకుండా, ఆ వాగులో ఎప్పుడూ నీరుంటుంది. ఎండాకాలమైతే అడుగున- సన్న జాలుగా పారుతుంది. వర్షాకాలమయితే- ఇహ దాని పొగరు చెప్పనక్కర్లేదు. కొండలమీది వాన నీరంతా, ఆ వాగులోకే చేరి, వరదగా మారి, పొలాల్ని జలమయం చేసేస్తుంది. అయిదారు ఊళ్ళు కూడా మునిగిపోతాయి. వరద తీసిందాకా- జనమంతా- గుట్టలమీదనే కాపరం.

అవునా?

ఎండకాలం వచ్చిందనుకోండి! అయినా- వాగులో అంతో ఇంతో నీరుంటుందనుకోండి! అయినా- వాగుకు, అటుపక్కా, ఇటుపక్కా ఉన్న పొలాలన్నీ, నెర్రెలిచ్చిపోవలసిందే! దాహంతో ఆవురావురు మనవలసిందే! విత్తనాలు పొట్లి పోవలసిందే! జనం 'కేగర్లో' మంటూ పొట్ట చేతబట్టుకొని, వలస పోవలసిందే!

ఇందులో ఉన్న తిరకాసేమిటో నాకు తెలీక వారినడిగాను గదా-

"ఎవర్రా, ఎవర్రా! మీకు పిచ్చా, చపల చిత్తమా? ఇంత కద్దు మాంఛి- నీటి వనరు మీకుందిగదా? అనువైన స్థలమేదో చూసుకొని, ఈ వాగుకు అడ్డుకట్ట వేసుకోరాదా? నీటిని కొండల మధ్య నిలవచేసుకోరాదా? అప్పుడు వరద బెదా ఉండదు- నీటి కొరతా ఉండదు. ఆ నిలవనీటిని చక్కగా- మీ పొలాలకు తెచ్చుకొనవచ్చునే!" అన్నాను.

"అలా తేనీరు బాబుగారూ!" అన్నారాయన.

"ఎంచేత?" అని నే నడక్కుండారు ఆయన అసలు సంగతి కాస్తా చెప్పుకొచ్చారు.

నిలవనీటిలో, ఏవూరి వారు- ఎంత వాటా వాడుకోవాలన్న సమస్య చాలా సంవత్సరాల దాకా తెగలేదుట. చచ్చీ చెడీ- ఒక సర్దుబాటు కొచ్చేసరికి ఇంకో మిత్తవవొచ్చిపడింది! అక్కడెక్కడో ఓ ఫ్యాక్టరీ కడుతున్నారట! ఈ నీరంతా దానికే కావాలిట. అంచాత ఒక్క నీటి బొట్టును గూడా, ఈ పొలాలకు ఫాక్టరీ వారు 'తేనీరు'ట!

అయ్యా!

నేను మూడోసారి 'తే నీరు' అన్న మాటను విన్నదీ- అదిగో - అప్పుడు!

--0--

# కథానాయకుడు దొరికాడు:

# ఇక కథ దొరకాలి!

శ్రీ మద్రమా రమణ గోవిందో హరి!

శ్రీ ఆంజనేయ వరద  గోవిందో హరి!!

శ్రీ పుండరీకాక్ష వరద గోవిందో హరి!!

... ఇవ్విధంబున ఇష్ట దేవతా ప్రార్థనముఁ జేసి, సుకవి స్తుతియు, కుకవి నిందయుఁ గావించి, నా రచించపబోవు వచన మహా ప్రబంధమునకుఁ గథాక్రమం బెట్టిదనిన...

* * *

అతని పేరు ఆనందం. అతని పేరు ఆక్రోశం. అతని పేరు భయం. అతని పేరు నిర్భయం. అతని పేరు మోహం. అతని పేరు దాహం. అతని పేరు కరుణ. అతని పేరు కసి. అతని పేరు దుఃఖం. అతని పేరు దిగులు. అతని పేరు మోసం. అతని పేరు హాసం-

సర్లెండి!

ఇల్లాగా మనం చెప్పుకోగలగాలే గానీ, అతని కెన్ని పేర్లయినా ఉన్నాయి. ఎందు కుండకూడదు? అదేదో ఓ దేవుడు గారికి సహస్ర నామాలదాకా లేవా? ఆ పేర్లన్నింటినీ మనం ఆమోదించాం గాదా? అలాంటప్పుడు- అందులో సగం పేర్లను-

పోనీ సగానికి సగం పేర్లను- నా కథా నాయకునికి పెడితే మీ కభ్యంతరం ఉండకూడదు.

నా మాట నమ్మండి.

నా కథా నాయకుణ్ని దేవునితో పోల్చడం నా కెంత మాత్రం ఇష్టం లేదు. ఫలానా ఫలానా దేవుడుంగారికి వేయి పేర్లున్నట్లే, ఫలానా ఫలానా కథానాయకునిక్కూడా అనేక పేర్లున్నాయని చెప్పడం మాత్రమే నా వంతు. ఈ పేర్లన్నీ నేను పెట్టినవీ కావు. ఆ మాటకొస్తే ఇవి పేర్లు కూడా కావు. అతనికున్న గుణాలు. అతనిలో ఉన్న గుణాలు.

ఉదాహరణకు: అతని పేరు 'ఆనందం' అనుకొందాం. ఆనందం పుట్టడానికి 25 సంవత్సరాలు ముందుగా ఆనందం గాడి తల్లి పుట్టింది. 'ఆనందం తల్లి' ఆవిడ బిరుదు నామ మేగానీ అసలు పేరు కాదు. ఆవిడ అసలు పేరు కాంచనం!

మీరెరగరు గానీ- కాంచనం- అక్షరాలా కాంచనమే! ఆవిడ పచ్చగా ఉండేది. కాంచనంలా ఉండేది. ఇలా- సరదాగా ఎక్కడ నొక్కినా- ఆ ఇంతమేరా తెల్లగా లొత్తపడి- మెల్లగా, రంగులో రంగు కలిసి పోయేది. ఆవిడకు వొంకుల జుట్టు లేదు. నవ్వినప్పుడు సొట్టలు పడేందుకు వీలయిన బుగ్గలు లేవు. తళతళలాడే కళ్ళు లేవు. సన్నగా, సంపెంగ మొగ్గలా, మొనదేరిన ముక్కులేదు. అయినా కాంచనం అందంగానే ఉండేది.

ఆవిడ గారి అందం మీకు చూడాలని ఉన్నదా? అయితే ఆక్రోశంగారింటికెళ్ళండి. వరండాలోనే గుమ్మం మీదుగా ఉన్న పెద్ద పటం చూడండి. ఆ పటంలో ఉన్న అందం- ఆర్తనాదం గాడి తల్లిది. ఈ ఫొటో- ఆవిడ జబ్బుతో తీసుకొని తీసుకొని చనిపోయాక తీసింది.

(గమనిక: ఆనందంగాడి, ఆక్రోశం గాడి, మరో పేరు ఆర్తనాదం).

ఆవిడ అందం మీద అధమ పక్షం- 60 -70 పేజీలన్నా రాద్దామనుకొన్నాను. అలా రాసినా అనౌచిత్యం ఎంత మాత్రం 'కా'దని నాకు తెలుసు. అనౌచిత్యం కాకపోగా అది కొంత అవసరం కూడా అవుతుంది. అయినప్పటికీ, నేను రాయలేదు. ఇలా రాయకపోవడానికి ఒక్కటే కారణముంది. ఇది ఆక్రోశంగాడి కథగానీ, వాడి తల్లి కథకాదు.

ఏకధాటిన అరవయ్ పేజీలు రాసినా అనౌచిత్యమనిపించకొని అందమే, లేకపోయినట్టయితే, కాంచనం బతుకు అందరి బతుకుల్లాగే సాదా సీదాగా ఉండేది. మరో సంగతి- ఆవిడ అందానికీ, ఆవిడ మరణానికీ మధ్య- అవినాభావ సంబంధాలున్నాయి.

"నీకేమే తల్లీ! ఎవరయినా ఇట్టే ఎగరేసుకుపోతారు!" అనే వారు ఇరుగూ పొరుగూ.

అది నిజమే!

కాంచనను ఎగరేసుకుపోవడానికి చాలా మంది కాచుక్కూచున్నారు. కానీ ఎగరడానికి కాంచనం సిద్ధంగా లేదు. ఆవిణ్ణాపనికి సిద్ధం చేసినవాడు పరిమళరావు.

చూస్తూ చూస్తూ ఉండగానే ఇతగాడు- ముందుగా కాంచనం హృదయాన్ని దోచుకొన్నాడు. ఆ తరువాత ఆమెను నిలువునా దోచుకొన్నాడు. ఈ దోపిడిని ఆపడం కాంచనకు అతీతమైన

కార్యమేమీ కాదు. ఆపగలిగి ఉండి కూడా మె ఆప(ని చేయ)లేదు. లేదు సరిగదా, తనను సర్వదుంభాలాగా దోచుకుపొమ్మని పరిమళ రావుకు ప్రోత్సాహాన్ని కూడా ఇచ్చింది. ఏ కారణం చేతనన్నా పరిమళం రాకపోతే, కాంచనం అతగాడికి కబురంపించేది. కబురుక్కూడా రానప్పుడు కాసులంపించేది. ఇందులో 'ఆనందం' తప్ప, 'అవినీతి' ఎక్కడా కనపడలేదు. పైగా ఆ 'ఆనందం' కూడా, అలాంటిలాంటిది కాదు; భరించలేనంత గొప్పది. అవినీతి నుంచి ఆనందం రాదనీ, ఆనందం ఇచ్చేది అవినీతి కాదనీ, ఆవిడకొక గట్టి విశ్వాసం కుదిరింది.

"నీ పేరేమో కాంచనం. మరి నా పేరు పరిమళం. మనిద్దరం శాశ్వతంగా కలిసిపోతే తప్ప, బంగారానికి తావి అంటుకోదు." అన్నాడొకసారి పరిమళం- ఆవిడకు గిలిగింతలు పెడుతూ.

ఈ దెబ్బతో-ఆనందసీమల అవతలి గట్టు దాకా వెళ్ళి వచ్చింది కాంచనం.

ఏడాది గడిచింది!

బంగారానికి తావి; తావికి బంగారమూ; పెనవేసుకుపోతున్నాయి. ఈ 'పెన' రోజు రోజుకూ మెలివేసుకుపోతున్నది. ఈ మెలికతోనే ఉభయులూ, ఆనందసీమల అంచుల దాకా ప్రయాణాలు సాగిస్తున్నారు.

ఆ ప్రయాణంలో మన మోహం గాడు, ఆగడ్త దాటేశాడు. దాటిన చాలా కాలానికి గానీ, దాటిన అనుమానం రాలేదు. అనుమానం వచ్చాక కూడా పరిమళం రాకపోకలు సాగిస్తూనే ఉన్నాడు. నాలుగైదు మాసాలు గడిచాయి. అనుమానం కాస్తా గట్టిపడింది.

గట్టిపడిందని రూఢమయ్యాక పరిమళం కనబడలేదు.

"ఇది బడ్డు దేశం. ఇది గొడ్డు దేశం. ఇది గాడిదగుడ్డు దేశం. మీకు నీతి లేదు. మీకు జాతి లేదు. మీకు పాపం లేదు. మీకు పుణ్యం లేదు. మీకు ధర్మం లేదు. మీకు అధర్మం లేదు. మీకు న్యాయం లేదు. మీకు అన్యాయం లేదు... మీరు మోసగాళ్ళు. మీరు వంచకులు. మీరు హంతకులు. మీరు దొంగలు. మీరు దొంగలంజకొడుకులు" అని ఓసారి నోరు పారేసుకొన్నాడు ఆగ్రహం గాడు.

వీడి కోపం ఎవడిక్కావలి గనక! దవడ వాయగొట్టారు.

దిక్కులేని వెధవ గనక- వాణ్నలా దవడ వాయించారుగానీ- వాడన్న దాంట్లో కూడా సబబున్నది.

పరిమళం కనిపించడం మానేశాక- ఇక కనిపించనే కనిపించడని తేలిపోయాక- ముందుగా- కాంచనం ఆశ్చర్యపోయింది. ఆశ్చర్యపోయాక ఆలోచించింది. ఆలోచించాక దిగులు పడింది. దిగులు పడినాక బాధ పడింది. బాధ పడినాక దుఃఖపడింది. ఆ దుఃఖంలోనే కాంచనను డాక్టరు దగ్గరకు తీసుకుపోయారు.

"ఖర్చుకు వెనక్కు తీయకండి" అన్నాడు కాంచనం నాన్న.

"ఇవన్నీ నేను వింటూనే ఉన్నా. నన్ను చంపడానికి అందరూ కలిసి కుట్రపన్నుతున్నారని నేనప్పుడే గ్రహించా. ఈ నా కుట్రక్కారణం నాకు తెలుసు. కాంచనం తండ్రికి డబ్బుంది. ఆ డబ్బు

డాక్టర్ గాడిక్కావాలి. ఆ డబ్బు కోసం ఆ గాడిద వెధవ నన్ను చంపడానికి సిద్ధపడ్డాడు. చంపడం నేరం గదా! నేరం చేసిన వాడికి శిక్ష పడాలి గదా! నేరం చేయమని ప్రోత్సహించిన వాడికీ శిక్ష పడాలి గదా! మరి- పడదేం? నన్ను- "నిలువునా ఖూనీ చేయడానికి చూస్తున్నార్రోయ్- దేవుడా"- అని నెత్తినోరూ బాదుకొన్నా వినిపించుకోరేం? ఆ డాక్టర్‌గారు- నన్ను పొట్టలోనే ముక్కలు ముక్కలుగా కత్తిరించి, తునకలకింద నన్ను బయటికి తీస్తానన్నప్పుడు, కాంచనం తప్ప అందరూ ఆనందించారు!!" అన్నాడు దుఃఖం గాడు.

ఇలాంటి కత్తిరింపుల పని, అక్కడెక్కడో, ఆ మధ్య జరిగిందట. కత్తిరింపుల కార్యక్రమం జరుపుతున్నప్పుడు, పెద్ద ప్రాణానిక్కూడా మోసం వచ్చిందిట. అలా వచ్చిన సంగతి కాంచనకు తెలుసు. అందుకే ఆవిడ కత్తిరింపులకు వొప్పుకోలేదు.

"అందుకే కాంచనమంటే నాక్కోపం, నాకసహ్యం. నాకు ద్వేషం. నాకు కసి. ఏ మాత్తర్లతోనో, బిళ్ళలతోనో చచ్చే అవకాశముంటే- నేను చావడానికి కాంచనం కూడా గొణక్కుండా వొప్పుకొనేది. ప్రాణాపాయం లేకుండా, కత్తిరింపులు జరిగే అవకాశమున్నా, ఆవిడ వొప్పుకొనేది. ఆ అవకాశం లేదు గకనకనే- ఆవిడ లగ్గలకెత్తి ఏడిచింది. ఆ ఏడుపును కాంచనం అమ్మా నాన్న చూడలేకపోయారు. చూడలేక- నన్ను చంపేపని మానుకొన్నారు... ఉండడానికేం- నాకూ అమ్మా నాన్న ఉన్నారు. ఏం లాభం? పరిమళం గాడు, మా అమ్మను మోసం చేశాడు. మా అమ్మ- నన్ను చంపేసి, తను నీతిమంతురాలినని- లోకానికి చాటుకోవడం కోసం ప్రయత్నించింది. అసలేమీ జరగనట్లే నటిస్తూ, మిమ్మల్నందర్నీ మోసగించవచ్చుననుకొంది... వీరందరూ కలిసి, డబ్బుతో తమ పాపాలను కడిగి వేసుకోవచ్చుననుకొన్నారు. వారనుకొన్నది నిజమే గానీ- సుబ్బరంగా కడిగేసుకొనగలిగినంత డబ్బు వాళ్ళ దగ్గర లేదు. అదే గనక ఉండి ఉంటే- అసలీ కథకే ఆస్కారం లేకపోయేది" అన్నాడు దిగులుగాడు.

అతనిలో-

ఆనందం, ఆక్రోశం, భయం, నిర్భయం, మోహం, దాహం, కరుణ, కసి, దిగులు, దుఃఖం, మోసం, హాసం, ఎందుకున్నాయో ముందు ముందు తెలుసుకోవచ్చు... ఈ లక్షణాలన్నీ, ఒక్కటొక్కటిగానూ, జంటలు జంటలుగానూ, గుంపులు, గుంపులుగానూ, అతని లోలోపల తలెత్తుతూ ఉంటాయి. తిరుగుతూ ఉంటాయి. ఒక్కోసారి ఇవన్నీ కట్టగట్టుకొని, ఉప్పెనలాగా విరుచుకుపడడమూ కద్దు. ఇవన్నీ అతనిలో చోటు చేసుకోవడం వల్ల, అతని అభిరుచులు, అభీష్టాలు- వింతగానూ, విడ్డూరంగానూ ఉండేవి.

అతనికి-

తల కడుక్కోవడమంటే భయం. సైకిలెక్కడమంటే భయం. చెవిలో నూనె వేసుకోవడమంటే భయం. వెల్లకితలా పడిన బొద్దింకలంటే భయం. కప్పలంటే భయం, కుక్కలంటే భయం. సాలీడంటే భయం. పిడుగులంటే భయం. మడుగులంటే భయం. గాలమంటే భయం. శూలమంటే భయం. సూదులంటే భయం. సుద్దులంటే భయం. పూచిన పూలన్నా, పూచిక పుల్లలన్నా భయం. ఆకలన్నా, గొంతుపగిలే కేకలన్నా భయం. ఆరుద్ర పురుగంటే భయం. ఆముదపు కాయంటే భయం. గిత్తలంటే

భయం. అత్తరంటే భయం. చెరువు కట్టలన్నా, నాగజెముడు మట్టలన్నా భయం. జుట్టుకు రంగేసే వారంటే భయం.

బంగారప్పన్ను పెట్టుకొనే వారంటే భయం. గోడను కరుచుకొన్న బల్లులన్నా, నల్లగా ఉండే పిల్లులన్నా భయం.

అతనికి-

తీరిగ్గా గోళ్ళు కొరుక్కోవడం ఇష్టం. చెవిలో అగ్గిపుల్ల దోపుకొని, సుతారంగా తిప్పుకోవడం ఇష్టం. చెమట కాయల్ని ఎవరి చేతనన్నా గిల్లించుకోవడం ఇష్టం. పులిపిరి కాయను వేళ్ళతో నలుపుకోవడం ఇష్టం. గజ్జి కురుపును సూది మొనతో చిదుపుకోవడం ఇష్టం. అరచేతిలో అరచెంచా తేనె వేయించుకొని, కొసనాలుకతో నాకడం ఇష్టం. పసిబిడ్డల చెవి తమ్మెల్ని, ముని పళ్ళతో మెల్లిగా కొరకడం ఇష్టం! ముక్కులో వెంట్రుకలు పెరుక్కోవడం ఇష్టం. కూచుని కాళ్ళూపే ఆడవాళ్ళంటే ఇష్టం. సబ్బుతో వాళ్ళ వీపుల్ని నురగలెత్తేలా రుద్దడం ఇష్టం. బద్ధకంగా ఆవలించడం ఇష్టం. వేళ్ళు చిటపట లాడేలా విరుచుకోవడం ఇష్టం. మెత్తని పరుపుమీద, బొక్కబోర్లా పడుకోవడం ఇష్టం. దువ్వెనమీద పేనును, గోటితో నొక్కినప్పుడు వచ్చే 'చిట్' మన్నచిన్న చప్పుడును వినడమంటే ఇష్టం గోరు చిక్కుడు కాయలంటే ఇష్టం, ఎవ్వరూ చూడకుండా, బొడ్డు కిందికి వేళ్ళు పోనిచ్చుకొని, గోముగా సవరించుకోవడం ఇష్టం. రేగి పండ్లంటే ఇష్టం. సాతాళించిన శనగలంటే ఇష్టం. ఉడకబెట్టిన వేరుశనగ గింజలన్నా, దోరగా వేయించిన జీడిపిక్కలన్నా ఇష్టం.

అతనికి- సన్నగా, పొడుగ్గా, పచ్చగా, పల్చగా ఉన్న ఆడవాళ్ళంటే కోపం. గడియారమంటే కోపం, నెలలో మొదటి వారమంటే కోపం. వాడిపోయిన పూలంటే కోపం, లిప్‌స్టిక్ పెదవులంటే కోపం. కారు తలుపులు వేసిన చప్పుడంటే కోపం. పాలిష్ చేసిన పాదరక్షలంటే కోపం, తాంబూలం నమిలే వారన్నా, పగలబడి నవ్వేవారన్నా కోపం, నోట్లు లెక్క పెడుతున్న చప్పుడంటే కోపం, గాజులు గలగల్లాడితే కోపం, మూసుకొన్న కిటికీ రెక్కలంటే కోపం, మెరిసే ఉంగరాలున్న వేళ్ళంటే కోపం. కింది పెదవి పదే పదే వొత్తుకొనే వారంటే కోపం, పందిరి మంచమన్నా, ఆ మంచం చేసే చప్పుడన్నా కోపం. 'బ్రా'లన్నా , జాకెట్లన్నా కోపం...

ఇంతవరకూ నేను సేకరించిన సమాచారం ఇదీ! ఈ వివరాలను ముందుంచుకొని, ఏదో వో కథను పేనెయ్యడం, నా మట్టుకు నాకు- పెద్ద కష్టమేమీ కాదు. కానీ 'మంచి కథ' రాయడానికి , ఇంకా కొన్ని వివరాలు కావాలి. జవాబుల్లేకుండా పడి ఉన్న ప్రశ్నలకు జవాబులు కావాలి. ఇంతకీ ఆ పరిమళం గాడు, ఎందుకదృశ్యమయ్యాడు? ఇప్పుడెక్కడున్నాడు? కాంచనం చనిపోయిందని కుందనంగాడి వరండాలో ఉన్న ఫొటో చెబుతూనే ఉంది. మన కథానాయకుడు పుట్టిన తరువాత నుంచి చావబోయేదాకా, కాంచనం ఎలా బతికింది? ఆ బతికిన విధానాన్ని కాంచనం అమ్మా నాన్న ఆమోదించారా? ఈ తరహా వివరాలన్నీ నాక్కావాలి. వీటిని సేకరించడానికి, ఎంత కాలం పడుతుందో ఇప్పుడప్పుడే స్పష్టంగా చెప్పలేను. అవి కూడా చేతికందాలి. అప్పుడు గానీ, కథ రాయడం ప్రారంభించను.

మనవందనం గాడి అభిరుచులు, అభీష్టాలు; అభిప్రాయాలు, అనుభూతులు; మనకు ఖచ్చితంగా తెలిసినవే!

ఇతగాడు మన కథానాయకుడు.

వీణ్ని కేంద్రంగా చేసుకొని, వీడి చుట్టూ ముసురుకొనే కథ ఎలా ఉండాలో ఆలోచిస్తున్నాను. మీరూ ఆలోచించండి. ఇతగాడికి- తక్కున నప్పే కథకోసం వెదకండి. దొరికితే నాకు పంపండి. లేదో- ఏదో వొక నాటికి నేనే మీకు చెబుతాను.

--0--

# పుట్టి

సాంబయ్య మీకు తెలుసు గదా? అతను సోమరిపోతని, అతగాడి శత్రువులు సైతం అనరు గదా? అతని పొలం గూడా, చారెడు చల్లితే చాటెడు పండుతుంది గదా? భార్యా బిడ్డల వేపన్నా చూడటం మరచిపోతాడేమో తప్ప- తనకున్న ఆ అరక పొలాన్ని చూడకుండా, గంగ కూడా ముట్టడు గదా? తను తిన్నా, తినకపోయినా, నేల తల్లికి లోటుపాట్లు రానీడు గదా? కడుపు నాయగట్టుకొని, గట్టు మీద పడుకున్న రోజులూ ఉన్నాయి గదా? కళ్ళు మూసుకొని, అలా వేళ్ళతో సున్నితంగా స్పృశించి, తన పొలం మట్టి ఏదో- కానిదేదో, ఖరాఖండీగా చెబుతాడు గదా? అలాంటి సాంబయ్య పొలం ఈ సంవత్సరం ఈటుపోవటమేమిటండీ? ఎక్కడ ఏం లోపం చేశాడు గనక? ఎప్పుడు ఏం పొరపాటు చేశాడు గనుక?

పదెకరాల మీదా- తక్కువలో తక్కువ పది పుట్లూ పండుతాయనుకున్నాడు. పండినట్లేననుకున్నాడు- అదేం పోడుగాలి సోకిందో ఏం పాడో- నిక్కీ నీలిగీ చూస్తే- పొల్లూ నెల్లూతో కలుపుగుంటే- ఒక్క 'పుట్టి' తూగేసరికి తాతలు దిగొచ్చారు.

ఇదిలా ఉణ్నీండి-

అతగాడి ఇంటికి పగ్గం దూరంలోనే బసవయ్య మండువా ఉంది. కావడానికి బసవయ్య మంచివాడు. అదృష్టవంతుడు. అతనికి వరసగ్గా ముగ్గురు మగ పిల్లలు. నాలుగో వాడు కూడా, మగ పిల్లాడయితే బసవయ్య కే దిగులు లేకపోను. కానీ భగవంతుడు ఇంకోలా ఆలోచించాడు. అస్తమానూ బసవయ్య చెప్పినట్లే వినడం దేనికనుకొన్నాడేమో- ఒక సారి కనకమ్మ మాట కూడా విందామను కొన్నాడా దేముడు. ఏ మాటకామాటే చెప్పుకోవాలి. బసవయ్యగారి ముగ్గురు కొడుకులూ, రత్నాల్లాంటి వాళ్ళే! వారూ- వీరూ- చదవెయ్యమని అన్నారు గానీ, బసవయ్య వొప్పుకోలేదు. ఎందుకొప్పుకోవాలి? తన ముత్తాత చదువుకోలేదు. తన తాత చదువుకోలేదు. తన అయ్య చదువుకోలేదు. తనూ చదువుకోలేదు. వీరందరూ ఏ చదువూ లేకుండానే సుఖంగా బతికినప్పుడు, తన పిల్లలు మాత్రం ఎందుకు సుఖంగా బతకరు?

బసవయ్య మంచివాడే! సందేహం లేదు. కానీ మొండిఘటం. ఆయనకేం తోస్తే అదే

నిజం. ఆ నిజానికి, అరంగుళం మేర అటూ ఇటూ కూడా ఆయన గారు తొలగరు.

కొడుకుల చదువు గురించి కన్నా, తనకు ఆడనలుసు కూడా లేనందుకు, కనకమ్మగారు- అక్షరాలా బాధపడ్డారు. ఆవిడ గారు కన్నీరు మున్నీరుగా ఏడవని మాట నిజమే గానీ- కళ్ళు తుడుచుకున్న సందర్భాలు బోలెడు. ఏ ఆడపిల్ల వొంకులు జడ వేసుకున్నా, కనకమ్మగారి గుండె నిండా పాలు పొంగేవి. ఆవిడకా ముచ్చట తీరక- మగపిల్లలకే జడలు వేసి, పూలు తురిమి, లంగాలు ఓణీలు వేసి, మొగుడికి తెలియకుండా ఫోటోలు కూడా తీయించి దాచుకొంది.

ఈ మోజు చూసి- భగవంతుడు కూడా అమితంగా జాలిపడి ఉండాలి. నాలుగో కాన్పులో, కనకమ్మగారికి బంగారుతల్లి పుట్టింది. నిజంగా జానకి బంగారు బొమ్మ. పచ్చగా బొదబొదలాడుతూ ఉంటుంది. కూతురుకు పేరు పెట్టే విషయం కూడా కనకమ్మగారు, చాలా దూరం ఆలోచించి ఆలోచించి, 'జానకి' అని ఉండాలన్నది. ఆ పేరే అమ్మాయికి అచ్చి వస్తుందని చెప్పిన శాస్తుర్లు గారికి, ఓ బస్తా వడ్లు పంపించిన సంగతి బసవయ్యకు తెలియనే తెలియదు.

కొడుకులు చదువుకున్నా చుదువుకోకపోయినా ఆట్టే పట్టించుకోని కనకమ్మ, కూతురు చదువు విషయంలో మాత్రం అంత ఉదాసీనంగా లేదు. లేదు సరే గదా- బళ్ళో చెప్పిన చదువు సరిపోదేమోనని, ఉదయమూ సాయంకాలమూ, ప్రయివేటు కూడా చెప్పించింది. జానకి, అక్షరాలు కూడబలుక్కుంటూ ఒక్కో వాక్యమూ అంటున్నప్పుడూ, ఒక్కో పద్యాన్నీ పాటికి పదిసార్లు చదువుతున్నప్పుడూ, కనకమ్మగారి హృదయం, అమందమైన ఆనందంతో కందళించింది.

...కనకమ్మగారికి, ఈ మాయ కాలపు షోకు లేమీ తెలీక పోవచ్చుగానీ, ఆవిడ అమాయకురాలేం కాదు. జానకిని ఉత్తి పుణ్యానికే చదివించడం లేదు. ఆవిడ చిన్న తమ్ముడు- రాముడు అదే రాంబాబు- ఆవిడ దృష్టిలో ఉన్నాడు.

తన తమ్ముళ్ళందరిలోకీ రాముడంటే కనకమ్మ గారికి వల్లమాలిన అభిమానం, ఇందుక్కారణం- వాడు తల్లిగండాన పుట్టడం కావచ్చు. ఇంతప్పణ్ణించీ- తన దగ్గరే పెరగటమూ కావచ్చు. తన కొడుకులక్నా మిన్నగా, రాముణ్ని చూసిందనడం అబద్ధమేగానీ, వాణ్నెప్పుడూ మరో ఇంటి వాడిలాగానూ కనకమ్మగారు చూడలేదు.

ఏం?

తప్పేముంది?

భగవంతుడి దయ వల్ల ఇంకో ఆరు మాసాలు కళ్ళు మూసుకొంటే, రాముడు ఆఖరు పరీక్ష రాసేస్తాడు. ఈలోగా జానకి పరీక్షలు కూడా అయిపోతాయి. ఓ మంచి రోజు చూసి వాళ్ళిద్దరకూ ముడి పెట్టేస్తే- ఇంక దిగులంటూ ఉండదు...

కాని రాముడు దిగులు కలిగించే తీరాడు. వాడు జానకిని చేసుకోనన్నాడు. ఎందుకు చేసుకోవడం లేదో తెగేసి చెప్పాడు. కనకమ్మ గారి 'పుట్టి' నడేట్లో మునిగింది. ఆవిడ కుప్పకూలిపోయే అవకాశం కూడా ఇవ్వకుండా రాముడు, అవతలి కెళ్ళిపోయాడు.

ఈ సంగతి- రాముడు తనను 'కా'దన్న సంగతి- జానక్కి తెలుసునో లేదో మనకు తెలీదు. ఆ పిల్ల- అసలిదేమీ జరగనట్లే తల్లి దగ్గరకొచ్చి, ఏదో చెప్పబోయింది.

"నువ్వు పుట్టకపోతే నాకొకటే ఏడుపు. 'పుట్టి' నాలుగు రకాలుగా ఏడిపిస్తున్నావే పాపిష్టిదానా!" అన్నది కనకమ్మ కూతుర్ని కావలించుకొని భోరుమంటూ.

జానకి ఉలకనూ లేదు-

పలకనూ లేదు.

సన్నగా మాత్రం నిట్టూర్చింది.

--0--

# ఈసారికిలా పోనీండి

ఈ మహా చెత్త రచన నెలా మొదలెట్టడం? "ధృత శక్రాయుధ మింద్రగోపయుత మార్ద్రీభూత భూభాగ మూర్జితవాః పూర్ణ సరస్తటాక తటినీ శ్రేణిక మామోదవర్తిత కేకి ప్రకరం బలక్షిత దిశా దిత్యంబు" అనడం, నా కెంత మాత్రం ఇష్టం లేదు. ఇలా అనడం మల్లికార్జునభట్టు గారికే చేతనవుతుంది.

"అద్రి గ్రావము లుర్వీరాల, బలిఘోషా డంబరంబుల్ వియోగి ద్రోహం బొనరింప, వారి నిధి కెంగేటంగా వాహినుల్, భద్రేభ ప్రతి మానమూర్తి యగుచున్ పాదోధర శ్రేణి, కుంభ ద్రోణంబులు కుమ్మరించె, విమలాంభః పూరా ధారావళిన్" అనడం కూడా నాకిష్టం లేదు. ఆ పాటి వానలే ఉంటే, దేశం ఎప్పుడో బాగుపడిపోను. అదీగాక ఇది తెనాలి వారి ధోరణి.

"హరుడగు తత్పయోద సమయంబున నొక్కట విస్తరిల్లె, నవంబరమున అంబుద ధ్వనియు. పల్వల భూములపూరె దర్దురోద్గర రవముల్ మహీరుహ శిఖండములందు, శిఖండి తాండవాంతర మదమంజుల స్వన ముదారత రమ్యములై వనంబునన్."

మన ప్రథమాంధ్ర మహాకవి బాగానే చెప్పారుగానీ, అది నన్నయ్య చెప్పడమవుతుందిగానీ, నేను చెప్పడం కాదుగదా!

ముందుగా వానపడుతున్న వాతావరణాన్ని సృష్టించి, ఆ వాతావరణంలో మాత్రమే జరగడానికి అవకాశమున్న కథను రాద్దామని చాలా కాలంగా అనుకొంటున్నాను. ఈ వానను గురించి రాసేప్పుడు కూడా, మరీ మామూలు రొడ్డకొట్టుడు ధోరణిలో కాకుండా, కాస్త కొత్తగా ఉండే లాగా రాదామని నా తపన. ఇదివరకెప్పుడూ ఏది రాదామన్నా నాకాట్టే వ్యవధి పట్టేది కాదు. అనుకోవడమూ, అలా అనుకొన్న దాన్ని కాగితం మీద పెట్టడమూ, దాదాపుగా ఒకేసారి జరిగిపోయేవి. ఇప్పుడలా కాదు. ఏం రాదామన్నా వల్లమాలిన అనుమానాలు, ఏం చెబుదామన్నా ఛప్పన్నారు సందేహాలూ, నన్ను- ఇట్టే- ముసురుకొంటున్నాయి.

చాలా కథలు వానతో ఆగిపోతాయి. ఈ కథ వానతోనే ప్రారంభమవుతుంది. వానలేక పోతే ఈ కథ ఉండనే ఉండదు. అందుకనే నేను వానను గురించి రాయడం గురించి, అంతలా తాపత్రయ పడడం.

ఎవరెవరో మహానుభావులు, వర్షాన్ని వర్ణించిన సందర్భాలను గుర్తు చేసుకొన్నానుగానీ- అవేవీ నావి కావని కనీసం నా అంతరాత్మకన్నా తెలుస్తున్నదే! ముందు దానికి నేను సమాధానం చెప్పుకోలేక చావాలి!

అసలీ గొడవంతా దేనికిట? నా ధోరణిలోనే, నేను చెప్పుకొంటూ పోతాను. ఏమయితే, అదే అవుతుంది!

నింగిమీదికి నీటి మబ్బులు దాడి చేశాయని, రాస్తే? దుఃఖాగ్ని ధూమరాసులతో వియత్తలం క్రిక్కిరిసి పోయిందని రాస్తే? విజయగర్వాంధుడైన స్వర్గాధిపతి మెరుపు కత్తితో, ఆకాశాన్ని ఆ కొస నుండి ఈ కొసదాకా సర్రున చీల్చి వేశాడని రాస్తే? కరిమబ్బుల మాటున కారెనుబోతులు 'ఖణేల్' మంటూ రంకె వేశాయని రాస్తే?

వీటిల్లోంచి ఏదో ఒక వ్యాక్యాన్ని ఎంచుకొని, కథను ప్రారంభించుదామనుకొన్నాను.

"రండమ్మా! అలా కూచోండి!... వారి కోసమేనా?... ఏదో రాసుకుంటున్నారల్లే ఉంది... ఎవరొచ్చారని చెప్పమంటారండీ?"

అది మా ఆవిడ గొంతు.

ఇహ- గో(హో)విందా! ఈ పూటకు నా దస్త్రం కట్టేయడం మంచిదనిపించింది. కానీ ఈలోగా నాకింకో చిన్న అనుమానం కూడా కలిగింది. ఆ వచ్చిన వారెవరో ఐదు పది నిమిషాల్లో తేలిపోతే తర్వాతన్నా రాసుకోవచ్చు. అంటే విచ్చేసిన వారెవరో ముందు తెలుసుకొని, ఆ తరువాతనే దస్త్రం ముడుద్దామనుకొన్నాను.

"ఈ వేళపుడు ఇంట్లో ఉంటారో ఉండరోననుకొంటూ హడలిపోయాం. మేం నక్కను తొక్కొచ్చినట్టుంది. ఇంటి పట్టున ఉన్నారు... వారిని పిలవండమ్మా! అడగవలసిన నాలుగూ అడిగేసి వెళ్ళిపోతాం!" అన్నదో గొంతు.

ఆ గొంతు నేనెక్కడో విన్నట్టే ఉంది.

"వారుగానీ మిమ్మల్నిప్పుడు రమ్మన్నారా?" అన్నది మా ఆవిడ.

"లేదు! మా అంతట మేమే వచ్చాం! ఏవఁమ్మా! అలా రాగూడదా?" అన్నది మరో గొంతు.

ఈ గొంతును కూడా నేనెప్పుడో విన్నట్టుగానే ఉంది!

"రాకూడదని కాదమ్మాయ్! ఆయన గారు ఇంట్లో ఉన్న సంగతి కూడా, చూసినట్టుగా చెబుతుంటేను- ఒక వేళ- ముందుగా, వస్తామని చెప్పారేమో ననుకొన్నాను... ఇన్నిటికీ మీ పేరేమిటో చెప్పనేలేదు"అన్నది కాంతం.

ఆ రెండు గొంతుల్లో ఓ గొంతు హాయిగా నవ్వింది. ఆ నవ్వు కూడా నాకు తెలిసిందే!

“మేము మరీ కొత్త వాళ్ళం కాదండీ! ఇప్పటి దాకా, మాక్కొంచెం... అవునుగానండీ! నన్నుగానీ, ఈవిణ్నుగానీ, మీ రెప్పుడూ చూడలేదంటే నేన్నమ్మను” అన్నదో గొంతు.

“చూశానేమో బాగా గుర్తు లేదమ్మా! ఎవరెవరో, ఎప్పుడూ వచ్చి పోతూంటారు. మరీ తరచుగా వచ్చే వాళ్ళయితే గుర్తుంటారు గానీ... మీరు ఇదే మొదటిసారిగానా ఇక్కడకు రావడం?” అన్నది కాంతం.

“కాదండీ... మేం చాలా దూరం నించి వస్తున్నాం. కాస్త అలసటగా కూడా ఉంది. ముందు మంచినీళ్ళివ్వండి. ఆ తరుటవాత కాస్త కాఫీయో, టీయో, మా ముఖాన పోయండి. ఈ లోగా- వారి నిక్కడకు పంపించండి. తరువాత పనేమీ లేకపోతే, మీరు కూడా మాతో కూచోండి. ఆయన వ్యవహారమేమిటో, మీరుండగానే తేల్చుకొనడం మంచిది.”

నా గుండెల్లో గుండ్రాయి పడింది. ధోరణి చూస్తుంటే- ఈ బంగారు తల్లులు నా చర్మం వొలిచిగానీ కదిలేట్టు లేరు. ఇక లాభం లేదనుకొని దస్త్రం కట్టేశాను.

“వస్తున్నారా?” అంటూ కాంతం- తానే లోపలి కొచ్చింది...“వింటున్నారుగా ధోరణి! పేరు చెప్పడానిక్కూడా గీర పోతున్నారు; అదేం తలబిరుసండీ బాబూ! నే నేదో వాళ్ళను కూపీ లాగుతున్నట్టూ, ఆ లాగుడు నుంచి వాళ్ళు తప్పుకొంటున్నట్టూ మాట్లాడుతున్నారు.... ఎక్కడో ఎరిగిన ముఖాల్లాగే ఉన్నాయి. కాస్త తొందరగా తెమలండి!” అంటూనే ఆవిడ వంటింటికేసి వెళ్ళింది.

వాళ్ళను పోల్చుకోవడానికి, నాకయితే పది సెకెండ్లు కూడా పట్టలేదు. నేను కాస్త తత్తరపడ్డట్టున్నాను. ఆ సంగతి మంజరి పట్టేసింది.

“నేనిలా వస్తానని మీరనుకొనే అనుకోలేదు గదూ?” అన్నది కౌముది.

“ఇద్దరూ ఎక్కడ కలిశారు?” అన్నాను మంజరిని చూస్తూ.

“నేనడిందానికి సమాధానం చెప్పకుండా, తెలివిగా మీరింకో ప్రశ్న వేస్తారని నేననుకొంటూనే వున్నా! నేనే మనుకొన్నానో- సరిగ్గా మీరాపనే చేశారు” అన్నది కౌముది.

“నువ్వు చాలా తెలివైన దానివని; నాకెప్పుడో తెలుసు. నీ తెలివి తేటలన్నింటినీ పసిగట్టలేనన్న అనుమానం ఒకప్పుడు నన్ను పీడించింది. అందుకని నీలాంటి అమ్మాయి లెక్కడుంటారోనని ఆత్రంగా వెదికాను. నీలాంటి అందగత్తెలు, నీకన్నా మించిన అందగెత్తలు చాలా మంది నాక్కనిపించారు...ఏం? అలా ముఖం ముడుచుకున్నా వేమమ్మా? లోకంలో, నీ కన్నా అందంగా ఉండే వాళ్ళిక ఉండ గూడదా?” అన్నాను కౌముది కళ్ళల్లోకి చూస్తూ.

“ఉండవచ్చునేమో లెండి... ఉన్నారేమో గూడా మరి!...ఉండకపోతే మీరు మాత్రం అలా ఎందుకంటార్లెండి? ఇన్నిటికీ నేనడిగిన ప్రశ్నకు మీరు జవాబివ్వనే లేదు. నే నడిగినదేమిటంటే-”

“నా ఓపికను పరీక్షకు పెట్టడం నీకు మాత్రం అన్యాయమనిపించడం లేదా? నీకీ మధ్య చాదస్తం మరీ ముదిరినట్టుగా ఉంది, ‘మీరిద్దరూ ఎక్కడ కలిశారమ్మా?’ అని నేను మర్యాదగా అడిగితే ‘ఫలానా చోట కలిశా’మని చెబితే పొయ్యేదానికి, నువ్వు డొంకంతా కదుపుతావేం?” అన్నాను.

కౌముది నా వేపు కళ్ళింత చేసుకొని చూసి, సుతారంగా తలొంచుకొని, అంత కన్నా సుతారంగా కాళ్ళూపుతూ, మళ్ళీ తలెత్తి నా వేపు చూసింది. కౌముది అలా ఎందుకు చేసిందీ, ఎందుకు చూసిందీ నాకు తెలిసిపోయింది. ఆవిడ నోరు విప్పకముందే- ఠకీమని నేనే అనేశాను.

"నువ్వేమందా మనుకున్నావో నాకు ముందే తెలుసు. నేను జగన్నాధాన్ని కాను. అతగాడికి ఆడవాళ్ళు కాళ్లూపుతుంటే చూట్టం సరదా! నా స్థానంలో జగన్నాథం ఉంటే, ఊగే నీ కాళ్ళకేసి లొట్టలేస్తూ చూసేవాడు. వాడు చూస్తున్నాడని నీవు పసిగట్టావో- వాడిక వెర్రెక్కి చచ్చిందాకా నువ్వలా ఊపుతూనే ఉండేదానివి... ఈ సొల్లు కబుర్లకేం గానీ... ముందా  కాఫీ తాగు. అందులోనూ బాగా అలసిపోయానంటున్నావు" అన్నాను.

ఈసారి మంజరి నవ్వింది.

మా ఆవిడకు వాళ్ళిద్దర్నీ పరిచయం చేశాను.

"అదే ఆయనతో అన్నానమ్మాయ్! నేనయితే అంత బాగా పోల్చుకోలేకపోయినాను...' అన్నది కాంతం.

మంజరి, 'ఫర్వాలేదమ్మా!' అనైనా అన్నది- మర్యాదకోసమేననుకో, కౌముది ఉబకేసేటందుకైనా- కనీసం నవ్వనన్నా నవ్వలేదు.

"మీరు కూచోండి..." అంటూ, గోడ కానించిన కుర్చీని వాల్చింది మంజరి.

"మా ఇంటికొచ్చినందుకు మిమ్మల్ని మర్యాద చెయ్యవలసిందిపోయి- నాకు మీరు మర్యాద చేయడమేమిటర్రా?" అన్నది కాంతం.

అన్నదేగానీ ఆవిడ కూచోలేదు.

"మీరు మాట్లాడుతుండండమ్మా! నాకేమో సాహిత్యాలూ చట్టుబండలూ బోధ పడవు. పోనీ- తెలిసినా తెలీకపోయినా, కూచుందామన్నా, ఈ పూట పనిమనిషి రాలేదు..."

కాళీ కప్పులు తీసుకొని ఆవిడ వెళ్ళిపోయింది.

"నవ్వారేం?" అన్నది మంజరి.

"నువ్వేదో మహానటివని లోకమంతా నిన్ను ఆకాశానికెత్తుతుందిగానీ, నిత్య జీవితంలో, నిమిష నిమిషం మేము చేసే అభినయానికి అంతూ పొంతూ లేదు. నువ్వు గాదు సరిగదా- నీ తల దన్నిన జేజెమ్మ దిగొచ్చినా అనుమానించడానికి వీల్లేనంత హాయిగా, ఓ మాట అనేసి మా ఆవిడ చక్కా లోపలికెళ్ళిపోయింది" అన్నాను.

"అంటే- పనిమనిషి ఎగవేయడమన్నది అబద్ధమంటారా?" అన్నది మంజరి.

"అబద్ధమని నేనొప్పుకోవలసి వస్తే అసలు పని మనిషే పెద్ద అబద్ధం. నీకు తెలీదేమో మంజరీ! నా సంపాదన వేళకింత తిండితినడానికి సరిపోతుందేమో గానీ, విలాసాలకు సరిపోదు" అన్నాను.

“పనివాళ్ళను పెట్టుకోవడం అవసరం అవుతుంది గానీ, విలాసం కాదే!” అన్నది కౌముది, నా దొంగతనాన్ని కనిపెట్టిన దానికి మల్లే.

“అదే నీకూ నాకూ వున్న తేడా! నీకు అత్యవసరంగా కనిపించే చాలా సదుపాయాలు, నా ప్రాణానికి ఖరీదైన విలాసాలు, ఫోను నీకు అవసరం. నాకు శుద్ధ దండగ. కారు లేక పోతే నీకు క్షణం గడవదు. నాకు ఎవరన్నా కారును దానమిస్తానన్నా నేను పుచ్చుకోను. టీ.వీ నీకో మామూలు వస్తువు. నాకో బంగారు కల” అన్నాను.

“మీరేదో వాదనకోసమిలా అంటున్నారుగానీ- ఇవన్నీ నిజమని, నేననుకోలేకపోతున్నాను” అన్నది కౌముది.

“నువ్వనుకోలేవు. అనుకో కూడదు. అలా అనుకొంటే నీ పేరు కౌముది కాదు... నువ్వు రామకృషయ్య కూతురివీ కాదు... నా మాటలు- నీకీ జన్మలో అర్థం కావు” అన్నాను.

కౌముది ముఖం గండరించింది. నేను కాస్త గట్టిగానూ, ఇంకాస్త గొంతు పెంచీ అని ఉంటాను. అన్ని మాటలూ కావు గానీ, ‘నీకీ జన్మలో అర్థంకావు’ అన్న ఆఖరు వాక్యం కౌముదిని గాయపరచి ఉంటుంది. నేను సర్దుబాటు చేదామనుకొంటుండగానే కౌముది కళ్ళింత చేసుకొని, అననే అన్నది-

“నేను మరీ అంత - మీరనుకొనేటంత బండను కాదేమో లెండి” అని.

కౌముదిని చూస్తే నాకే ‘అయ్యో! పాపం!’ అనిపించింది ఆ క్షణాన.

“అమ్మడూ! నీ తెలివితేటలకూ, నువ్వర్థం చేసుకోడానికీ- ఆట్టే దగ్గర సంబంధం మున్నదనుకోవడం లేదు. నీకు నాకూ మధ్య వున్న అంతరం- ఆశ్చర్యంగా చూస్తావేం- అర్థం కాలేదు గదూ? ఇంకాస్త విశదంగా చెబుతాను... నవ్వు పెరిగిన వాతావరణానికీ, నేను పెరిగిన వాతావరణానికీ ఎక్కడా పొంతన లేదు. నీ అంతస్థు వేరు. నా అంతస్థు వేరు. మన మన అంతస్థులను బట్టే మన మన సమస్యలు కూడా ఉంటాయి. విమానం తప్పి పోవడమన్న సమస్య నాకెప్పుడూ రాదు. వందరూపాలయ నోటు పారేసుకోవడమన్న పొరబాటు నేనెప్పుడూ చేయను. ఎందుకో తెలుసా?” అన్నాను.

“మీ అంతలేసి తెలివితేటలు అందరకూ ఉండవద్దా మరి!” అని ఎద్దేవా చేసింది కౌముది.

నాక్కాస్త చిరాకేసింది ఆ మాటకు.

“నేను చెప్పేది పూర్తిగా వినే వోపికా శ్రద్ధా లేకపోతే- మనం ఇంకోదాన్ని గురించి మాట్లాడుదాం!....” అన్నాను విషయాన్ని తప్పిస్తూ.

“లేదులెండి బాబుగారూ! అక్కగారికి విషయం తెలీదు. కాస్త తొందరపాటు ఎక్కువ... నేను వింటున్నాను. చెప్పండి!” అన్నది మంజరి!

కౌముది కూడా కాస్త సంబాళించుకొని చెప్పమని అడిగింది. ఆ అడగడంలో, సిన్సియారిటీ ఉన్నదని తోచాకనే నాకు తోచిన నాలుగు ముక్కలూ చెప్పాను.

''నేను నిన్ను తప్పు పట్టను. నీలాగా పుట్టిన వాళ్ళూ, పెరిగిన వాళ్ళూ దాదాపు నీలాగానే ప్రవర్తిస్తారని నాకు తెలుసు... ఇప్పటి దాకా నేను వాగిందంతా- నీకు చాదస్తంగా ఉంటుందేమో గానీ, మీ నాన్నగారి కుండదు. ఆయనకు దరిద్రం తెలుసు. ఆకలి తెలుసు. రాళ్ళు మింగేటంత ఆకలీ తెలుసు. అవమానం తెలుసు. లొంగిపోవడంలోని నీచత్వం సైతం తెలుసు. ఆర్జించటం తెలుసు. నవ్వు పుట్టే వేళకు- మీ నాన్న లక్షాధికారి కాదు గానీ, మరీ కటిక పేదవాడు కూడా కాదు. అందుకనే అప్పుడప్పుడైనా పేదలన్నా, పేదతనమన్నా, ఆయన గారి గుండె కరిగిపోయేది. ఆయన తెలివితేటలన్నీ ధనార్జనకోసమే వ్యయం చేసిన సంగతి నీకూ తెలుసు. దరిద్రంలోని అమానుషతనం అనుభవించాడు గనుకనే, తన పిల్లలు దరిద్రం అనుభవించకూడదనుకొన్నాడు. అనుకొని ఎడాపెడా సంపాదించాడు. సరిగ్గా... ఆ సంపదల మధ్యలోంచి నువ్వు బతుక్కొచ్చావు. నీకు సుఖం తప్ప దుఃఖం తెలీదు. ఆనందం తప్ప విషాదం తెలీదు. ఏ కుర్రవాయాలూ, నాలుగు రోజులపాటు నిన్ను మిర్రిమిర్రి చూడకపోతే, నీకు దుఃఖం పుట్టుకొస్తుంది. నీవు రాసిన ప్రేమ లేఖకు అవతలివాడు గింగిరాలు తిరగకపోతే, నిన్ను విషాదం ముంచెత్తుతుంది... ఇంతకు మించిన గొప్ప గొప్ప సమస్యలు నీకు రావు... అంచేత నేను మనవి చేసుకొనేదేమిటంటే కౌముదిగారూ! నీకూ నాకూ మధ్య, చాలా మెట్ల ఎడం ఉన్నదీ- అని! మన సమస్యలు, మెట్ల సంఖ్యను బట్టి మారిపోతూ ఉంటాయి. ఇందాక అన్నాను చూశావా- విమానం తప్పిపోయే సమస్య అని; అదీ నాకు రాదు. రాకపోవటానిక్కారణం నా తెలివితేటలు కాదు; నా పర్సు. నాకసలు విమానంలో ప్రయాణం చేయాలన్న కల కూడా రాదు. అలాగే ఏనాడూ నా జేబులో వంద రూపాయల నోటుండే అవకాశం ఉండనప్పుడు, అది పోయే ప్రమాదం కూడా ఉండదు... నేను చెబుతున్నది వింటున్నట్లు లేదు. ఏదో పరధ్యానంగా ఉన్నావు... కుర్రనాయనలు వెంటపడడం, ప్రేమ లేఖలు రాయడం, అనేసరికి పాత రోజులు గుర్తుకొచ్చి ఉండాలి. అవునా?'' అన్నాను అంటపొడుస్తూ.

కౌముది, ముందుగా బిత్తరపోయింది. ఆ తరువాత తేరుకొని ఫకాలుమని నవ్వింది. ఆ నవ్వులో ఎక్కడా మాలిన్యమన్నది లేదు.

''ఆ సంగతి నేనూ గమనించాను. ఏది? పరధ్యానంగా వున్న సంగతి. మధ్యలో ఆపడమెందుకని ఊరుకొన్నాను.'' అన్నది మంజరి. ''ఒక్క సంగతి చెప్పండి. అక్కగారి విషయం మీకూ తెలిసిందే గదా! తెలిసి కూడా అలా ఎందుకు చేశారు? చాలా మంది డబ్బులున్న వాళ్ళు దానధర్మాలు చేశారు; చేస్తున్నారు. నాకు తెలిసినవాళ్ళే బోలెడంత మంది ఉన్నారు. కౌముది కూడా ఏవో చందాలు అవీ ఇచ్చినట్లూ, నాలుగు మంచి పనులు చేసినట్లూ రాస్తే మీ సొమ్మేం పోయిందండీ?''

''ఇందులో పోవడానికి నా సొమ్మంటూ ఏమీ లేదు. అలా రాయడం పెద్ద కష్టం కూడా కాదు. కానీ- అది సహజంగా ఉండదు. ఒక మనిషి మాట్లాడే తీరు, బతికే పద్ధతి, ఆలోచనా విధానం, ఆఖరుకు కట్టుతిట్టూ కూడా- ఎన్నింటి మీద ఆధారపడి ఉంటాయో తెలిస్తే నువ్వలా అని ఉండవు మంజరీ! కౌముది పెరిగిన వాతావరణంలో, పెరిగిన వారందరూ, అచ్చంగా అక్షరాలా అల్లాగే ఉంటారని నేననడం లేదు గానీ, దాదాపుగా అల్లాగే ఉంటారు.'' అన్నాను మంజరితో.

ఆవిడేమీ అనలేదు. ఏదో అందామని, ఒకటి రెండు సార్లు చిన్న చిన్న గుటకలు వేసి కూడా మానేసింది. నా ధోరణి కౌముదికి నచ్చినట్టు లేదు. ఆవిడ నవ్వడానికి వ్యర్థ ప్రయత్నం చేసింది. ఎక్కడో ఉన్న చిరునవ్వును పెదవుల మీదికి తెచ్చుకొనేందుకు, కౌముది మల్లగుల్లాలు పడడం చూస్తే నాకు నవ్వొచ్చింది.

"పిచ్చి పిచ్చి ప్రయత్నాలు చేయమాకు. నువ్వు అంతో ఇంతో అందంగా ఉండే మాట నిజం! నువ్వు నవ్వినప్పుడు కూడా ఫర్వాలేదు- అందంగానే ఉంటావు. కానీ బలవంతాన నవ్వడానికి, ఇంకెప్పుడూ ప్రయత్నించకు" అని కౌముదికి చిన్న సలహా ఇచ్చాను.

"నాకా అవసరం లేదే!" అన్నది కౌముది.

"ఇది మరో బుకాయింపు... ఎడాపెడా సంపాదించిన డబ్బు ద్వారా సంస్కారాన్ని కొనుక్కొన్న వారిలోనూ, నాగరికతను కొనుక్కోగలమనుకొన్న వారిలోనూ కనబడకుండా ఉండే రోగాల్లో ఇదొకటి. తాము చాలా ఎత్తుగా ఉన్నట్టూ- ఏ విమర్శలు తిట్లు తమను ఈషణ్మాత్రం కూడా కదిలించలేవన్నట్లు ప్రవర్తిస్తారు. అందుకోపం నానా అవస్థపడతారు... ఇదిగో ఆగు... నా మాట పూర్తిగా విను. మధ్యలో నాకు అడ్డం రాకు...ఆఁ... లింకు తెగిపోయింది. ఇప్పుడు నేనేమంటున్నాను?"

"మీకూ ముసలితనం వచ్చేసింది!" అన్నది మంజరి పకాలుమని నవ్వేసి. "చాలా సరదాగా ఉంది... మీరెక్కుడున్నారంటే- ఏ విమర్శా తమనేమీ చేయలేవన్నట్టుగా ప్రవర్తించడానికి నానా అవస్థ పడతారు" అని మంజరి, తెగిపోయిన కొసదారం నా కందించింది.

"అవును, కరెక్టే! నేను మాటాడే ధోరణి కౌముదికి నచ్చలేదు. నచ్చదని కూడా నాకు తెలుసు. ఆమె మెహర్బానీ కోసం ఆమెకు నచ్చేలాగా మాట్లాడవలసిన అవసరం నాకు లేదు. నా మాటలు-కౌముదిని అంతో ఇంతో గాయపరచి ఉంటాయి. నా ఉద్దేశం కూడా ఆవిణ్ను గాయపరచాలనే! గాయం తగిలి గిలగిల లాడిపోతూ కూడా - తనకు దెబ్బలేమీ తగలనట్లుగా కౌముది నటిస్తున్నది. ఆ నటనలో భాగమే ఆవిడ బలవంతంగా నవ్వడానికి ప్రయత్నించడం... గతంలో చాలా సార్లు- అవసరం వచ్చినప్పుడల్లాననుకో- నువ్వు నవ్వావు. అది చాలా సహజంగా ఉంది. హాయిగా ఉంది. ఆ నవ్వుకోసం గుంట వెధవలు నీ చుట్టూ ఈగలు ముసిరినట్టు వల విసిరేవారు. వారలా ముసిరినప్పుడు, ఏ బెల్లం నీళ్ళో చల్లి, వాళ్లను దగ్గరకు లాక్కునేదానివి... ఆ నవ్వుకూ, యిప్పటి నీ నవ్వుకూ ఎక్కడా పోలిక లేదు. కావలిస్తే మంజరినడుగు" అన్నాను.

మంజరి కాస్త ఇబ్బందిగా ముఖం పెట్టింది.

"మధ్యలో దాన్నడగడమెందుకులెండి? మీరు చెబితే నేను కాదన్నాను గనకనా?" అన్నది కౌముది ముఖం ముడుచుకొని.

"నేను చెప్పిన వాటినన్నింటినీ, తుడిచి పారేస్తూనే, అంగీకరిస్తున్నట్టుగా పోజు పెట్టడం కూడా నీ సంస్కారంలో భాగమే. చాలా మంది పరవంచనా, లోకవంచనా చేస్తారు. ఆత్మవంచనా చేసుకొంటారు. మీలాంటి వారికున్న మాయరోగమేమిటంటే, మీరు కావాలని ఆత్మవంచన చేసుకొంటూ, ఆ గోతిలో దిగి గిలగిలలాడుతూ, ఇంకెవరో మిమ్మల్ని వంచించటానికి కుట్రలు

చేస్తున్నట్టుగా మీరు అనుమానపడతారు. ఆ కుట్రలు పారకుండా చేశామనీ, చేయగలిగామనీ, మీ భుజాలు మీరే చరుచుకొంటారు.. నిజానికి ఇందులో ఏ ఒక్కటీ నిజం కాదు...'' అని దులిపేశాను.

ఈ దులుపుడుకు కౌముది రెచ్చిపోతుందనుకొన్నాను. చెడామడా వాగుతుందనుకొన్నాను. అదేమీ లేకపోగా కళ్ళనీళ్ళ పర్యంతమయింది. కౌముదిని చూస్తుంటే నాకే జాలేసింది. పనిమాలా నన్ను చూడ్డానికొచ్చిన ఆ చిలకమ్మను ఇలా దులిపేయడం భావ్యం కాదనిపించింది. కానీ- ఇంకోలా చెబితే కౌముది వినిపించుకోదు. మనలో మాట- ఇప్పటికయినా అర్థం చేసుకొన్నదని నేను గట్టిగా అనుకోలేకపోతున్నాను.

''నన్ను మన్నించాలి కౌముది గారూ! తమను నొప్పించాలని నా ఉద్దేశం కాదు. నేను చెబుతున్నది- అచ్చంగా నిన్ను గురించేననీ నువ్వనుకో రాదు. నేను నీ వర్గ స్వభావాన్ని గురించి చెబుతున్నాను.... ఇదే మీ నాన్నను గురించయితే- నా ధోరణి ఇంకోలా ఉంటుంది.''

''ఎలా వుంటుంది?'' అన్నది మంజరి.

''ఆ ప్రశ్న కౌముది అడిగినట్టయితే నేను సంతోషించి ఉండేవాణ్ని, నాకు తెలిసినంతవరకూ, తన తండ్రిని గురించి కౌముదికి అట్టే సదభిప్రాయం లేదు. ఆయనకు సంపాదించడం తప్ప, మరో యావ లేదని కౌముది చాలాసార్లు అనుకొన్నది. ఒకటి రెండుసార్లు తాననుకొన్నదేదో పైకి అనేసింది కూడా. రామకృష్ణయ్యగారు, కూతురుకన్నా గడుసు పిండం. ఆయన ఆశ్చర్యపోయినట్టు నటించారే తప్ప నిజంగా ఆశ్చర్యపడలేదు. ఆయన కటిక దరిద్రంలో పుట్టి పెరిగి, దరిద్రం అంచులను తాకి చూశాడు. చాలా సార్లు ఆత్మాభిమానాన్ని చంపుకొన్నాడు. కానీ చంపుకోనట్టుగా జనం ముందు ప్రవర్తించాడు. ఏం చేస్తే రూపాయి చేతబడతుందో అవన్నీ చేశాడు. డబ్బు సంపాదనకు అనుకూలమైన వాతావరణాన్ని ఆయన సద్వినియోగం చేసుకొన్నారు. అలాంటి వాతావరణం లేనప్పుడు, తన తెలివి తేటల్ని ఉపయోగించి, ఆ వాతావరణాన్ని కృత్రిమంగా కల్పించి, అందులోంచి రూపాయలు పిండాడు. ఆయన దృష్టిలో రూపాయికున్న విలువ ఇంక దేనికీ లేదు. అందుకోసం ఆయన అడ్డమైన పనులు చాలా చేశాడు.. అవునా?'' అన్నాను.

''నిజమేనండీ!'' అన్నది కౌముది నెమ్మదిగా. ''ఆయన్ను చూస్తుంటే నాకు భయమూ, జాలీ కూడా వేస్తుండేవి. కొన్నిసార్లు మందలించాను కూడా...ఆయన వినిపించుకోలేదు.''

''వినిపించుకొన్నాడు - కా దనకు'' అన్నాను, మధ్యలో అడ్డుపడుతూ.

''వినిపించుకొన్నాడేమో గానీ- అవేవీ ఆయన మీద పని చేయలేదు. కట్టుకుపోయినంత సంపాదించిన తరువాత కూడా, డబ్బు కోసం అంతగా వెంపర్లాడడం చూస్తుంటే- నా కొక్కోసారి చిరాకెత్తుకొచ్చేది'' అని పకాలున నవ్వింది కౌముది. ''ఇది కూడా వర్గ స్వభావమే నంటారా?''

''ఎందుక్కాదు? ఆయన దరిద్రం అనుభవించిన వాడు గనక- ఆ బాధలు తన బిడ్డలు అనుభవించకూడదనుకొన్నాడు... అనుకొని, మీకు బోలెడంత స్వేచ్ఛనిచ్చాడు. నువ్వూ, మీ అన్నయ్యా- అన్నయ్యేనా? తమ్ముడా?- మీరిద్దరూ ఆ స్వేచ్ఛను దుర్వినియోగం చేశారు. నువ్వేమో, కనపడ్డ ప్రతి వెధవనూ కవ్వించడం ప్రారంభించావు. మీ వసంత్‌గాడు తాగుడుకూ, ముండలకూ తగలేశాడు...

అదే చెప్పొస్తున్నా! కొంత మొత్తం పోగుపడే దాకా- నువ్వు చావు యాతన పడక తప్పదు. రాగా రాగా ఆ యాతనకు నువ్వు అలవాటు పడిపోతావు. అలవాటు పడి, ఇంకా ఇంకా డబ్బు పోగేస్తావు. ఒక దశ దాకా డబ్బును నువ్వు ఆడిస్తావు. ఆ తరువాత అది నిన్ను ఆడిస్తుంది. మీ నాన్నగారు- ఈ రెండు ఆటలూ చూశారు. ఆయన గారికి డబ్బు సంపాదించడమన్నది- తొలి దశలో లక్ష్యం. మలి దశలో వృత్తి. తుది దశలో ఒక ఉపాసన. జీవితాంతం ఆ దేవతను ఉపాసిస్తూనే ఉన్నారు... అయినా ఆయన తన దరిద్రాన్ని మరచిపోలేదు. దాన్ని మరచిపోయిన రోజున ఉపాసనకు ఉద్వాసన చెబుతాడు... తన లేమిని పదే పదే గుర్తు చేసుకొంటూ, సంపాదనక్కావలసిన ఇన్‌స్పిరేషన్‌ను ఆయన తెచ్చుకొనే వాడు...'' అన్నాను.

''నన్నిక్కడ కూచోబెట్టి మా నాన్న గారిని ఎన్నెన్ని మాటలంటున్నారండీ! ఆయనే గనుక వినివుంటే మీ భరతం పట్టి ఉండేవాడు'' అన్నది కౌముది సరదాగా నవ్వుతూ.

''అక్కడే నీవు పొరబడుతున్నది, మీ నాన్న ఒక్క నాటికీ ఆ పని చేయడు. 'నా అసలు స్వరూపం నా కళ్ళకు చూపించావు నాయనా!' అని నన్ను ఉబ్బేసి ఉండేవాడు. కాస్త మంచి గుణాన ఉంటే లోలోపల కూడా మెచ్చుకోవచ్చు. నువ్వలా కాదు. నీ అసలు స్వరూపం చూచుకొనటానికి నీకు చచ్చేంత భయం! ఆ భయం నుండి తప్పుకోడానికి నువ్వు బరితెగించావు...''

కౌముది పళ్ళు గిట్టకరుచుకొంది. రెండు పిడికెళ్ళూ బిగించి నా ముఖం ముందు ఆడించి కాళికాదేవిలా ఉగ్రరూపం ధరించింది.

''నేనలా కావడానిక్కారణం నువ్వు కాదా! అంతకన్నా మంచిగా రాయడానికి నీ చేతులు పడిపోయాయా?'' అని అరిచింది దయ్యంలాగా!

కౌముది ముఖం నిండా చెమట కమ్మింది. కంఠ నాళాలు ఉబికాయి. కనుకొలకులు ఎర్రబడ్డాయి. కోపంతో గజగజలాడిపోయింది.

వంటింట్లోంచి మా ఆవిడ వచ్చింది. మంజరి కూడా గాభరా పడ్డది. కౌముది రెండు భుజాలమీద చేతులు వేసి, అదిమి కూచోబెట్టింది.

''ఏమయిందర్రా?'' అన్నది కాంతం- ఆ ప్రశ్న అందరకూ తగిలేట్టుగా.

''ఏం లేదు లేవే! కలిగినవారమ్మాయి గదా! అహంకారం దెబ్బతినేసరికి ఆగ్రహం ముంచుకొచ్చింది... నువ్వు లోపలికి వెళ్ళు. పాలుంటే- ఇంకో మూడు కప్పులు టీ చేసిపెట్టు...'' అన్నాను ఆవిడతో.

''ఇదేం లక్షణమయ్యా?'' అన్నది కౌముది.

''ఏది?''

''నే నింతగా ఎగిరిపడ్డా, మీరు సర్దుకొని హాయిగా చల్లగా మాట్లాడ్డం?''అన్నది కౌముది.

''అది ఆయన వర్గ లక్షణం'' అన్నది మంజరి నవ్వుతూ.

ఆ మాట-కౌముదిని చల్లబరచడానికన్నదో, నన్ను ఎత్తి పొడవడానికన్నదో నేను చప్పున

పోల్చుకోలేక పోయాను.

"నువ్వెందుకన్నా- నువ్వన్నమాట నిజమే! అలా ఉండడం నీ లక్షణం. నాకు సంబంధించినంతవరకూ- మీరిద్దరూ నాకొక్కటే! ఇంకొంచెం వివరంగా చెబుతాను. మీరిద్దరేకాదు- మీ చుట్టూ ఉన్నవారంతా నాకొక్కటే! ఒకరికి అట్టు, మరొకరికి ముక్కా పెట్టడం నా పనికాదు... నాకు న్యాయమని తోచిందేదో నేను చేశాను" అన్నాను.

"మీరు చేసిందంతా చెప్పిందంతా నిజమేనా?" అని నన్ను నిగ్గదీసింది మంజరి.

"నాకు నిజమని తోచింది నేను చెప్పాను. నాకు నిజమని తోచింది నేను చేశాను. మరో సంగతి ఇందాకణ్నించీ మనం 'నిజం, నిజం, నిజం' అనుకొంటున్న దున్నదే అది సాపేక్షికం. నీ నిజం వేరు. నా నిజం వేరు. మరో వాడి నిజం వేరు. పోలీసులు చెప్పే నిజం వేరు. నేరస్థుడు చెప్పే నిజం వేరు. లాయరు చెప్పే నిజం వేరు. న్యాయమూర్తి చెప్పే నిజం వేరు. అసలు నిజం వీటిల్లో ఏదో ఒక్కటయి ఉంటుంది. లేదా- వీటన్నింటికీ భిన్నంగానూ ఉండి ఉంటుంది. నాకన్ని వివరాలూ, ఉన్న పళంగా గుర్తు రాకపోవచ్చు గానీ- నీ విషయంలో న్యాయం చేశాననే ఇప్పటికీ అనుకొంటున్నాను కదా?" అన్నాను.

"కాదులెండి!" అని చప్పరించేసింది మంజరి, "ఎవరి ముఖం వారికి అందంగా కనబడకపోతే, ఈ లోకంలో చాలా మంది అద్ధం చూసుకొంటూనే ఆత్మహత్య చేసుకొనేవారు. ఈ సూత్రం, ముఖానికే కాదండీ; అన్నింటికీ వర్తిస్తుంది. మీ ధోరణి మీకు నిజం! అదే దోరణి నాకు నిజం కాదు."

కౌముది- ఈ సరికి కాస్త తేరుకొంది. చెమటను చిన్న గుడ్డతో తుడుచుకొని, వానిటీ బ్యాగ్‌లోంచి అద్దం తీసి- ఓసారి కనుబొమలు విరిచి చూసుకొని, లిప్‌స్టిక్ సరిచేసుకొంది.

"ఇలాంటి బాగ్ నీకున్నట్టు నాకు తెలియదమ్మాయ్!" అన్నాను బుజ్జగింపు ధోరణిలో.

ఈసారి ఎందుకనో గానీ- కౌముది సన్నగా నవ్వింది.

"ఇది నాది కాదు... మంజరిది. నన్ను డబ్బున్న వాడి కూతుర్ను చేశావుగానీ- నాకో వానిటీ బ్యాగ్ తగలించిలేకపోయావు" అన్నది కౌముది.

"నువ్వాగవే!" అని కౌముదిని నోరు మూయించింది మంజరి. "మనమిప్పుడు నిజాలను గురించి చెప్పుకొంటున్నాం... ఇంతకు ముందు మీరు కౌముదితో మాట్లాడుతూ, దాన ధర్మాల ప్రసక్తి తీసుకొచ్చారు..మీకు గుర్తుండే వుంటుంది. రామచంద్రంగారి ఊరినించి- వారెవరో వచ్చి కాలేజీ పెట్టుకోవడానికి చందా కావాలంటే-"

"నాకు గుర్తుంది. నువ్వు చిల్లి పైసా ఇవ్వలేదు. డాన్సు ప్రోగ్రామో పాడు ప్రోగ్రామో ఏర్పాటు చేసుకోమనీ టిక్కెట్లమ్ముకోమనీ సలహా యిచ్చావు. ఆ మాట నువ్వంటున్న వేళకు. నీవు డబ్బు లేని దానివేం కాదే! పదివేలో పాతిక వేలో- ఇలా- ఎడం చేత్తో పారేసి ఉండేదానివేనే! కనీసం- నువ్వు పనిచేస్తున్న పది పిక్చర్ల ప్రొడ్యూసర్ల చేత చందా వేయించినా వాళ్ళడిగిన డబ్బుకన్నా ఎక్కువ పోగుపడి వుండేదే! నువ్వా పని ఎందుకు చెయ్యలేదమ్మా?" అన్నాను.

"అవును చెయ్యలేదు" అని నసిగింది మంజరి.

"చెయ్యలేదని నాకూ తెలుసు ఎందుకు చెయ్యలేదూ- అని?" నిగ్గదీశాను మంజరిని.

"ఎందుకు చెయ్యలేదో చెప్పండి?" అన్నది మంజరి, ఆ సంగతి కూడా నా చేతనే చెప్పింతామని!

"అది నీ వర్గ లక్షణం గనక!" అన్నది కౌముది ఎగతాళిగా నవ్వుతూ.

"కౌముది ఆ మాట ఎగతాళిగా అన్నా- నిజమే చెప్పింది. నీ లక్షణం అదీ! ప్రొడ్యూసర్ల నించి పిండుకొన్న నీ నల్ల డబ్బు కదలకూడదు. ప్రొడ్యూసర్లతో నీకున్న ఆబ్లిగేషన్ చెడగూడదు గనుక వారిని చందాలు అడక్కూడదు. కానీ నీ- పేరు మీదుగా ఒక కాలేజీ ఉండాలని- లోపల నీకూ పీకుతూనే ఉంది! అయితే ఆ కాలేజీకి నీ చేతినించి దమ్మిడీ రాలకూడదు. ఇవన్నీ ఆలోచించే- నువ్వు ప్రోగ్రాం ఏర్పాటు చేసుకోమన్నావ్!" అన్నాను.

"ఇంకోటి మరచిపోయారే!" అన్నది మంజరి.

"పోనీ నువ్వు గుర్తు చేయరాదా!" అన్నది కౌముది.

"నాకు- డాన్స్ ప్రోగ్రాముల ద్వారా కీర్తి సంపాదించుకొందామన్న తపన కూడా ఉన్నదనటం మరచిపోతే ఎలా?" అన్నది మంజరి.

"పది సినిమాల్లో మాంచి వేషాలు వేసి, పది పదులు వంద చేతులతో డబ్బునూ, వెయ్యి చేతులతో కీర్తినీ పోగేసుకోవడం మరిగిన వారికి- చిన్న చిన్న ప్రోగ్రాముల ద్వారా కీర్తి సంపాదించు కొందామన్న ఆత్రం ఉంటుందో ఉండదో కూడా తెలీని వాణ్ని కాదు... నువ్వెంత అద్భుతంగా డాన్స్ చేసినా- ఓ మామూలు సినిమాలో, చాలా మామూలు వేషం వేస్తే వచ్చే కీర్తికాన్న తక్కువ కీర్తి వస్తుంది. ఆ సంగతి నీకూ తెలుసు. ఇక్కడ నీకు డాన్స్ ప్రోగ్రాం ముఖ్యం కాదు. ఆ ప్రోగ్రాం వల్ల వచ్చిన ఆదాయంతో తయారవబోయే కాలేజీకి నీ పేరు పెట్టడమన్నదే ముఖ్యం. ఈ ముఖ్యమైన పని నీ డబ్బుతో కాకుండానే, నీ ముఖమాటాలు చెడకుండానే జరగాలి. నువ్వలా జరిపించావు" అన్నాను.

"ఆ కాలేజీకి నా పేరు పెట్టొద్దని కూడా అన్నానే!" అన్నది మంజరి.

"ఎందుకనవూ? నీకు వీసమెత్తు కీర్తి కాంక్ష కూడా లేదని నలుగురూ అనుకొనే లాగా చేయడానికి, అంతకన్నా మంచి వాక్యం ఇంకోటి లేదని నీకూ తెలుసు... ఇప్పుడంతా అయిపోయింది గనక ఏమనుకొన్నా ఇబ్బంది లేదనుకో! నిజంగా- నీవన్న ఆ మాటనే, వారు సీరియస్‌గా తీసుకొని, ఆ కాలేజీకి నీ పేరు పెట్టకపోతే- నువ్వేం చేసి ఉండేదానివంటే-"

"సంతోషించి ఉండేదాన్ని" అన్నది మంజరి చటుక్కున.

"ఒక్క నాటికీ అలా చేసి ఉండవని పందెం వేస్తా. అసలు- నీ లక్ష్యం వేరే లాగా ఉన్నప్పుడు, పరిస్థితుల్ని ఇంకొక దిక్కుకు ఎందుకు పోనిస్తావమ్మా? నీవు తెలివి తక్కువ దానివేం కాదే!" అన్నాను.

“ఆ నా బొంద తెలివి,” అని చప్పరించేసింది మంజరి.

“ఏం చేసి ఉండేదంటారు?” అన్నది కౌముది.

“అసలా కాలేజీకి శాంక్షన్ రాకుండా చేసేదానివి. కమిటీ మెంబర్లలో నలుగురు నోరుగల వెధవల్ని ఇట్టే పట్టుకొని, వారిని ఆనందంలో ముంచి లేవనెత్తి ఉండేదానివి. ఆ తిక్క దిగకముందే, వారిచేత నీక్కావలసిన పనులన్నీ చేయించుకొని ఉండేదానివి” అన్నాను.

“ఎంతెంతలేసి మాటలంటున్నారండీ నన్ను?” అన్నది మంజరి ఆ మాటలేవో తనను గాయం చేసినట్లుగా అభినయిస్తూ.

కౌముది సంగతి నాకు తెలియదు గానీ, నాకయితే అది ఫక్తు అభినయమని ఇట్టే తెలిసిపోయింది.

“నిన్ను నేనేమీ కాని మాటలననే అనలేదు. ఉన్న నిజమే చెప్పాను... జ్ఞాపకం చేసినందుకు నీవేమి అనుకోకు... వాడెవడికో ఓ పెద్ద కాంట్రాక్టు కావలసి వచ్చినప్పుడు, ఆ శాంక్షనింగ్ ఆఫీసర్‌ను రాత్రికి రాత్రే వెంట తెచ్చుకొని, తెల్లారే సరికి వాణ్ని కూబి వెధవను చేసి పారేశావు... అలా చేయడం వల్ల నీ కేదో పెద్ద లాభం ఉండకపోతే- లోకోపకారార్థం వీడితో ఏకశయ్యన ఉన్నావంటే నేనెలా నమ్ముతానమ్మా? ఆ ఆఫీసర్‌గాడికి పోయిందేమీ లేదు. పోవడమంటూ జరిగితే, అది ప్రజల డబ్బు. ఆ డబ్బు ఏ ఉమ్మాయికో, జగ్గాయికో చేరవలసిందే- తప్పదు. నీ పుణ్యాన- నీక్కావలసిన వాడికి చేరింది. నీతో ఓ రాత్రి గడిపానని, జన్మంతా చెప్పుకోవడం కోసం వాడో గుడ్డి సంతకం చేసి పారేశాడు. ఒక రాత్రి ఉత్తినే పడుకొనే బదులు, వీడితో పడుకొన్నావ్. అంతే తేదా?” అన్నాను.

ఈ కామెంట్ కౌముదికి నచ్చలేదు. ఆవిడకు ప్రేమను గురించి, చాలా గమ్మత్తయిన అభిప్రాయాలున్నాయి. వాటినన్నిటినీ నాముందుగుమ్మరించింది కౌముది.

“నేను నీ సంగతి మాట్లాడడం లేదు. మంజరిని గురించి చెబుతున్నాను. నీకు మగనాయనలు వెంట పడడం సరదా! అలా పడకపోతే పిచ్చెక్కి ఛస్తావు. మంజరికి మగవాళ్ళంటే పరమ అసహ్యం. ఈ రోత- ఆవిడ మంగమ్మగా ఉన్నప్పుడే ఆరంభమైంది. మగాడంటే ఏమిటో, లైంగికానందం యెలా ఉంటుందో, తెలుసుకొనే ఈడు రాకముందే, మంగమ్మ చాలా మంది మగవాళ్లను చూసింది. తన దగ్గర కొచ్చిన వాళ్ళకు లైంగికానందం యిచ్చిందే గానీ- తాను అనుభవించిందని, నే ననుకోను... ఒక రామచంద్రం అంటేనే మాధవరావంటేనో సదభిప్రాయం ఉండటం వేరు. అంతకు ముందు తన దగ్గరకొచ్చిన మగవాళ్ళందరి కన్నా వీరిద్దరూ మంగమ్మ దృష్టిలో మంచివారు. ఆవిడ సినిమా తారగా ఆకాశమంత ఎత్తుకు ఎదిగినప్పుడు కూడా, వారిద్దరి మంచితనాన్ని ఆవిడ మరచిపోలేదు. అంటే మంగమ్మ జీవితంలోనూ, మంజరి జీవితంలోనూ తటస్థపడిన వారందరిలోనూ వీరిద్దరే ఆవిడకు నచ్చారు. ఏమమ్మా అంతేనా?” అన్నాను.

మంజరి కన్నీళ్ళు తుడుచుకొంది. అవి- సినిమా కన్నీళ్ళు ఎంత మాత్రం కావు.

“మగవాళ్ళను సరదాకోసం వేటాడ్డం నీ స్వభావం. మగవాళ్ళ సరదాకోసం వేట జంతువు కావడం మంజరి స్వభావం కాదు- అది ఆవిడ వృత్తి. చాలా మంది ఆ వృత్తిలో ఉండి,

ధ్వంసమయిపోయారు. మంజరి మాత్రం ఆ వృత్తి ఆధారంగానే పైకెదిగింది'' అన్నాను కౌముదితో.

''మీరు మరీ మమ్మల్ని హీనం చేసి మాట్లాడుతున్నారేమోననిపిస్తున్నది.. మంజరి పైకి రావడానికి ఆవిడ టాలెంట్ ఏ మాత్రం పనికిరాలేదంటారా?'' అన్నది కౌముది.

''టాలెంట్ అన్న ముక్కను నువ్వేసెన్స్‌లో అన్నావో నాకు తెలీదు. మంజరి కున్న ముఖ్యమైన టాలెంట్ ఆవిడ అనుభవం. చాలా మంది మగవాళ్లను ఎరిగి ఉండటం వల్ల ఓ మగ సన్నాసిని చూస్తూనే వాణ్ని క్షుణ్ణంగా చదవగలిగేది. ఈ అనుభవం ఆవిడకు చాలా అచ్చి వచ్చింది. మంజరి స్వతహాగా చూపరి. రామచంద్రంవల్లా మాధవరావు వల్లా మాటకారి తనం అబ్బింది. మంజరి పెట్టుబడులు ఇవీ! వీటితో ఆవిడ చాలా గొప్ప వ్యాపారం చేసింది. మంజరి ఎప్పుడూ పైకి అనలేదు గానీ- ఆవిడ లోపల ఓ కోరిక ఎప్పుడూ, జ్వాల లాగా మండుతూ ఉండేది. అదేమిటంటే- ఎదటివారు తనను చూసి అసూయపడేలాగా తాను బతకాలని. ఈ కోరిక మంజరి మనస్సును కుమ్మరి పురుగులా తొలిచిపారేసింది...''

''ఇదే వర్గ లక్షణమంటారు బాబుగారూ?'' అన్నది కౌముది చాలా నిర్లిప్తంగా.

''మీ నాన్నగారి వర్గ లక్షణమే ఇదీనూ. ఆయన దరిద్రం అంచులు చూశాడు. మంగమ్మా చూసింది. ఆయన పరిస్థితుల్ని తన కనుకూలంగా మలుచుకొన్నాడు. మంగమ్మ కూడా ఆ పనే చేసింది. జీవితంలో ఎదురైన ఏ చిన్న అవకాశాన్నీ వీరిద్దరూ విడిచి పుచ్చలేదు. అవకాశాల కోసం వారు అదే పనిగా అన్వేషించారు. ప్రతి అనుకూల పరిస్థితినుంచీ వారు లబ్ధిని పొందారు. మరీ అవసరమైనప్పుడు పరిస్థితుల్ని తాము అనుకూలంగా మార్చుకొన్నారు. జీవితం వారికి చాలా నేర్పింది. నేర్చుకన్నారు. నిటారుగా- నింగిలోకి, నింగిదాకా ఎదిగారు. మనను చూసి ఎదుటి వారు ఈర్ష్యపడి చచ్చేలాగా, రామకృష్ణయ్యా, మంజరీ కూడా బతికారు. ఆత్మవిశ్వాసం+పట్టుదల+తెలివితేటలు+ అదృష్టం వారినీ స్థితికి తెచ్చాయి'' అన్నాను.

మంజరి కళ్ళు తుచుకొన్నది.

''నీ గురించి మరో రహస్యం చెప్పనా? నువ్వు ముందు పుట్టావన్న మాటే గానీ- నీవు కౌముదికి చెల్లివే! అట్టడుగు రాతి పొరల్లోంచి నువ్వు మొలుచుకొన్నావు. పీల్చడానికి ఒక్క నీటి చుక్కకూడా నీకు దొరకనప్పుడు, గాలిలోంచీ, ఎండలోంచీ నీక్కావలసిన శక్తిని పిండుకొన్నావు... పది జన్మలక్కావలసినంత అనుభవమూ, పది తరాలక్కావలసినంత సంపదా సంపాదించావు... సరిగ్గా ఈ అనుభవం నుంచీ, ఈ సంపదనుంచీ కౌముది పుట్టుకొచ్చింది. జీవితం పట్ల నీకున్న పాటి అవగాహన కూడా మన కౌముదికి లేదు. ఆవిడ తనకన్నీ తెలుసుననుకొంటుంది. నిజానికేమీ తెలీదు. ఆవిడకు నచ్చే లాగా నాలుగు తీయని కబుర్లు చెప్పగల వాడికి, తన శరీరాన్ని నిరభ్యంతరంగా అప్పగిస్తుంది. ప్రతివాడూ తనకోసం తహ తహ లాడిపోతూ ఉంటాడని కౌముది నమ్మకం. నిజానికది ఉత్త భ్రమ. ఆవిడ వెనక ఉన్న డబ్బు, ఆ డబ్బు పరంగా ఆమె కొచ్చిన చదువు, ఆ చదువు వల్ల ముసురుకొన్న మనుషులు, ఆ మనుషులు తమ పబ్బం గడుపుకోడం కోసమని ఆమెలో పెంచిన అహంకారం- కౌముదికి జీవితానందాన్ని దూరం చేశాయి...''

ఈ మాటలన్నది మంజరితోనే అయినా, నేను గురి చూసింది మాత్రం కౌముదినే!

కౌముది, కాస్త ఇబ్బందిగా కదిలింది!

"అబ్బే! అదేం లేదండీ! మీరు పొరపాటు బడుతున్నారు. నేను మొదణ్నించీ సుఖంగానే వున్నాను." అన్నది కౌముది.

"నీక్కోపమొచ్చినా సరే- ఉన్న బాధను చెప్పకోడం, నీ వర్గ లక్షణం కాదు గనుక నువ్వు బయటపడ్డం లేదుగానీ- నిజానికి నువ్వు ఉండవలసినంత సుఖంగా లేవు. ఇక మొన్నాడు తాను వెళ్ళిపోతాననగా, ఆ రాత్రి జగన్నాథం నీకు హితబోధ చేసి ఉండకపోతే, నీ బతుకు నిప్పులకుంపటిలా తయారయి ఉండేది" అన్నాను కాస్త కోపంగా.

"మీరైనా అలా ఎందుకు చేశారండీ? అంతకన్నా కాస్త బాగా చేసి ఉండవచ్చు గదా!" అన్నది కౌముది.

"అది జరగదు. జరగడానికి వీల్లేదు కూడా. అలా చేయడమంటూ పోతే మంజరి ఆత్మహత్య కూడా చేసుకోకూడదు... జీవితాన్ని నీకన్నా స్పష్టంగా అర్థం చేసుకొన్నది మంజరి. జీవితాన్ని గురించి నీకు చాలా భ్రమలున్నాయి. మంజరి కలాంటి భ్రమలేవీ లేవు. నీ పునాదులు కృత్రిమమైనవి. నీ నాగరికత కృత్రిమమైనది. నీ సంస్కారం కృత్రిమమైనవి. నీది పరాధీనమైన జీవితం. ఎక్కడ ఏ పాటి చిన్న రాయి కదిలినా, నీ జీవిత సౌధం బీటలిచ్చిపోతుంది!! మంజరి నీకు ఫక్తు వ్యతిరేకం! ఆవిడకు రెండు జీవితాలున్నాయి. పైకి మనందరకూ కనిపించే జీవితమొకటి. లోపల - తానొక్కదానికి మాత్రమే తెలిసిన జీవితం మరోటి. తను చేస్తున్నది తప్పో ఒప్పో మంజరికి తెలుసు. ఆవిడ మోహతా దగ్గరపడుకొన్నా, వెంకటేశ్వరుతో పోర్లాడినా, అమెరికన్ కాన్సులేట్ చీఫ్ ఆఫీసర్‌తో తాగి తందనాలాడినా, ఇవన్నీ తెలిసే చేస్తున్నది. కావాలనే చేస్తున్నది. ఆవిడ- జీవిత సూత్రాలను తన చేతుల్లోనే ఉంచుకొని, తనక్కావలసిన విధంగా జీవితాన్ని నడుపుకొన్నది. దానిచేత బొమ్మలాట లాడించింది. ఈ ఆటలకు విసిగిపోయిన జీవితం- ఆమెకు ఎదురు తిరిగి, తన కసినంతా చివరి క్షణాల్లో తీర్చుకొన్నది... ఎందరెందరో, తనను చూసి అసూయపడి, ఈర్ష్యా జ్వాలల్లో మగ్గిపోవాలని కోరుకొన్న మంజరి- ఆ కోరికను సాధించడం కోసం, తన సర్వస్వాన్ని నిస్సంకోచంగా ధారపోసింది. కానీ- తనలో ఉన్న శూన్యాన్ని ప్రేమానురాగాలతో నింపుకోలేక- భయంకరమైన ఏకాకితనాన్ని భరించలేక-"

"మీరు చాలా తెలివైన వాళ్ళండీ! మీరు చేసిన ప్రతి వెధవపనినీ సమర్థించుకోవడానికిక్కావలసిన పాయింట్లన్నీ ఏరి పెట్టుక్కూచున్నారల్లే ఉంది. అడిగీ అడకముందే రకీరకీమనీ చెప్పేస్తున్నారు... ఎవరికో జాలి లేదనీ, దయ లేదనీ మీరంటున్నారు గానీ నన్నడిగితే మీకే లేదంటాను" అని కౌముది వేపు చూసింది మంజరి.

ఆవిడేమీ పలకలేదు. "ఎందువల్ల?"' అని నేనూ అడగలేదు. అడిగినా అడక్కపోయినా, తను చెప్పదలుచుకొన్నది కాస్తా చెప్పిందాకా మంజరి ఊరుకోదని నాకు తెలుసు.

"ఎంచాతనంటే?" అని ప్రారంభించింది మంజరి-

“మీరు కావాలని బుకాయిస్తే తప్ప నా వల్ల మీ కొచ్చినంత కీర్తి ఇంకెవరివల్లా రాలేదు... అలా ముఖం చిట్లించకు కౌముదీ! ఆఖరుకు నీవల్ల కూడా రాలేదు. మీ కింతకీర్తిని సంపాదించి పెట్టాను. పైగా నాలుగు డబ్బులు సంపాదించి పెట్టాను. ఈ రెండింటి కోసమూ నా చే అడ్డమైన పనులూ చేయించారు. నేను ముక్కు ముఖమూ ఎరుగని వారి కోసం ఆరాటపడ్డట్లు రాశారు. నాకు పెళ్ళిచేదామని గానీ, నన్నొక ఇంటిదాన్ని చేదామని గానీ, బిడ్డా పాపలతో నేను సుఖంగా ఉండేట్టు గాని, రాయడానికి మీకు చేతులు రాలేదు.” అని దులిపేసింది మంజరి.

“నీకెలా చెప్పనమ్మా! నేనివన్నీ కావాలని చేయలేదని, నిన్నెలా నమ్మించాలో నాకు బోధపడకుండా ఉంది. కోపంలో నువ్వు చాలా అభాండాలు నామీద వేశావు. కీర్తి కోసమూ, డబ్బుకోసమూ ఆరాటపడి చావడం నీ లక్షణం గనక, అందరిలోనూ అదే లక్షణం నీక్కనిపించడం సహజం! ఒక సన్నివేశంలో నువ్వుంటే ఏం చేస్తావో ఎదటివారు కూడా అదే చేస్తారని, నీలాంటి వారు అనుకోవడం కూడా సహజమే! మరో సంగతి- మంగమ్మగారూ! నువ్వు, ముక్కూ ముఖమూ ఎరగని వారికోసం ఆరాటపడ్డావని రాయలేదు... రాసి ఉండను. నేనేం రాసి ఉంటానంటే ‘ఆరాటపడ్డట్టు నటించా’వని రాసి ఉండొచ్చు. అలా రాయడంలో నీకూ తప్పు కనిపించకూడదు మరి. మొదలియార్‌గానీ, చందూలాల్‌గానీ... సరే- నీకు పెళ్ళికాదు. నీలాగా పెరిగిన వాళ్లను ఉంచుకోవడానికయితే చాలా మంది ముందుకొస్తారు గానీ, చేసుకోవడానికి రారు. ఒక వేళ వచ్చినా- వాళ్ళు నీ డబ్బుకోసమే వస్తారు తప్ప నీ కోసం అసలే రారు. నీ డబ్బు కోసం, నీ చుట్టూ తుట్టెల్లాగా కమ్ముకొన్న జనం అప్పటికే చాలా వుంది. నువ్వు సుఖపడాలంటే, నీ కోసం పడిచచ్చేవాడు కావాలి. ప్రేమబాపతు సినిమా డైలాగులుచెప్పే సరుకు నీ దగ్గరకు చాలా వచ్చింది. వారందరికీ నీ శరీరం కావాలి- అపారమైన కీర్తితో వెలిగిపోయే నీ శరీరం కావాలి. అదిచ్చే క్షుద్రానందం కావాలి. నీ ముఖాన ఇన్ని నోట్లకట్టలు పారేసో, ఓ మాంఛి- వేషం నీకు ఆఫర్ చేసో- నీ శరీరంతో కాస్సేపు ఆడుకొని, దత్తి తీర్చుకొనిపోయే సజ్జు- ఆంధ్రప్రదేశంలోనే ఏం ఖర్మ- దేశం మొత్తంమీదా దొరుకుతుంది; వెదికితే ఇతర దేశాల్లోనూ దొరుకుతుంది. వారెవరూ నిన్ను పెళ్ళి చేసుకోరు. పెళ్ళి చేసుకొనే వాడు నీకోసమనీ చేసుకోడు. నీక్కావలసింది, నిన్ను పెళ్ళాడేవాడుగానీ, నీ డబ్బుకు తాళి కట్టేవాడు కాడు...

అలాంటి సహృదయుడెవడూ నాక్కనిపించలేదు... నామీద నెపం వేయడం కాకపోతే, నువ్వొక మగాణ్ని పెళ్ళాడి వాడితో సుఖపడి ఉండేదానివేఆనా? పెళ్ళి చేసుకోడానికి ముందు వాడికి విషమ పరీక్షలన్నీ పెట్టేదానివి కావా? నువ్వెంత కాదన్నా- ఇది మగాధిక్యత వున్న సమాజం. నిన్ను చేసుకొన్నవాడు- నీ డబ్బు కోసమే చేసుకొన్నా- దాంతో బాటుగా నిన్ను అదుపు చేయాలని చూస్తాడు. గిరులు తీసి కదలవద్దంటాడు...

ఆ నిర్బంధంలో నువ్వొక్కనాడు కూడా ఉండలేవు. నీకొక షాట్ నచ్చి, అదే షాట్ డైరెక్టరుకు నచ్చక, ఇంకొకటేక్ తీసుకొంటానంటే, నువ్వు తిరగబడిన సందర్భాలు చాలా ఉన్నాయి. వాడేదో శాసిస్తున్నట్లూ, ఆ శాసనానికి నువ్వు తలవొంచవలసి వచ్చినట్లూ నువ్వనుకొని- వాడు చెప్పిందాన్ని వ్యతిరేకించావు... అలాంటి దానివి, నువ్వో మొగుడుతో కాపురం చేయం అసాధ్యం. నువ్వేం చేసినా ‘ఓకే’ అనే మొగుళ్లే దొరుకుతారు. వాణ్ని నువ్వసలు భరవంచలేవు... అసలు మగవాడంటేనే వల్ల

మాలిన అసహ్యం నువ్వు పెంచుకొన్నావు. ఇది నీ తప్పుకాదు... నీవున్న వాతావరణంలో ఉన్న ఏ ఆడకూతురు కైనా అలా అసహ్యం కలగడం చాలా సహజం... నీలో కసి, పట్టుదల, నీ శత్రువుల పట్ల ద్వేషం, నిర్దిష్టమైన లక్ష్యం లేకపోతే- నువ్వంత పైకిరావు. వచ్చినా, నీ లోపలున్న ఆర్ద్రతను, ఆవిరయిపోకుండా నిలుపుకోలేవు... పైకి నువ్వు మహానటివే గానీ- లోపల మాత్రం మనిషివి. మంచి మనిషివి కూడా... నిన్ను అష్టకష్టాల పాలు చేయడం నా ఉద్దేశం కాదు. నీలాంటి వాళ్ళ జీవితాలు ఎలా ముగిసిపోతాయో- సరిగ్గా అలాగే, నీ బతుకూ తెల్లారిపోయింది. మార్లిన్ మన్రో నీకన్నా నయం, ఆవిడకు అమ్మ, నాన్న ఉన్నారు.

"నీ ఖర్మ కాలిపోతే నీకు వాళ్ళూ లేరు. వాళ్ళెవరో నీకూ తెలీదు... ఏ ప్రేమానురాగాల కోసం నీ అంతరాత్మ తపించి పోయిందో- అవి ఈనాటికీ దానికి లభించలేదు. ఇకముందూ లభించవు... అది అంతియ!"

"అబ్బా! ఇక నన్నా ఊరుకోవయ్యా బాబూ!" అన్నది మా ఆవిడ నన్ను కుదుపుతూ.

ఆవిడ గొంతు గీరపోయినట్టుగా ఉంది.

"ఏమయిందే?"

"నువ్వేమన్నావయ్యా బాబూ! ఈ బిడ్డలిద్దరూ ఎలా ఏడుస్తున్నారో చూశావా? కళ్ళు మూసుకొని చెప్పుకొంటూ పోవడమేనా?" అన్నది కాంతం రవంత రుసరుసలాడుతూ.

నేనెప్పుడు కళ్ళు మూసుకొన్నదీ, నాకు గుర్తు లేదు. తీరా చూసేసరికి, అటు కౌముదీ, ఇటు మంజరీ కళ్ళనీళ్ళు పెట్టుకొంటున్నారు. మా ఆవిడ వాళ్ళను ఓదారుస్తున్నది.

"మీ రేమడిగారో, ఆయనేం చెబుతున్నారో మీరెందుకేడుస్తున్నారో, కాస్త నాకు తెలిసేట్టు చెప్పండమ్మాయిలూ! నాకు చేతనయిందయితే నేనే చేస్తా." అన్నది కాంతం, వాళ్ళ కన్నీళ్ళు తుడుస్తూ.

నే నయితే గమ్మున ఊరుకొన్నాను గానీ, కౌముది, మంజరి మాత్రం- అంత విచారంలోనూ ఫక్కున నవ్వారు.

"నాకూ, మంజరికీ కూడా, అన్యాయం జరిగిపోయిందండీ! ఇది అన్యాయమనీ, అక్రమమనీ మేమిద్దరం గోల పెడుతున్నాం. ఆయనగారు వినిపించుకోవడం లేదు. బాబుగారు తలుచుకొంటే- మమ్మల్ని బాగు చేసి, మేం సుఖపడేట్టుగా చేయవచ్చు. కానీ అది సుతారమూ వీలుపడదంటున్నారు. మా బతుకులు ఇల్లాగే- ఇంతే- ఉండాలంటున్నారు. చేతిలో ఉన్న పని గనక- చెప్పుకొంటేనన్నా మనస్సు కరగక పోతుందా, మార్పు చేయకపోతారా- అనుకొని వచ్చాం. ఇద్దరం కలసి, ఇంతసేపూ వాగినా బాబుగారి కుందేటికి నాలుగో కాలు మొలిపించలేకపోయాం!" అన్నది కౌముది మా ఆవిణ్ను వొరుసుకొంటూ.

"నీకైనా అంత మొండితనం పనికిరాదయ్యా! కాస్త ముందూ వెనకా చూడాలి. నువ్వేదో వొరగపెడతావుగదాని- ఎంతో దూరం నించి వచ్చారు పాపం" అంటున్నది కాంతం.

మధ్యలోనే-

“అవునండీ! చాలా దూరం నించి వచ్చాం!” అన్నది మంజరి, మరీ నయగారాలు పోతూ.

“వచ్చిన ఆడపిల్లల్ని ఉత్త చేతుల్తో పంపడం నీకు మంచిది కాదయ్యా! ఒకళ్ళకింత మంచి చేస్తే- ఆ భగవంతుడు మనకూ చేస్తాడు” అన్నది కాంతం నాకు నచ్చ చెబుతున్న ధోరణిలో!

నా వాళ్ళందరూ నాకిష్టమేగానీ, అందరిలోకి మరీ యిష్టం ఈ మంజరి, కౌముది అంటే! ఈ మంజరిని తలచుకొని, ఎన్నిరాత్రులు, నిశ్శబ్దంగా రోదించానో ఎవరికి చెప్పుకోను? ఎంత తెలివిగా, ఎంత వాడుపుగా, ఎంత గడుసుగా జీవించినా- జీవితానందమంటే ఏమిటో తెలుసుకోకుండానే మంజరి దాటిపోయినందుకూ- దాటిపోవలసి వచ్చినందుకూ- నా కళ్ళ నెత్తురులు కురిశాయంటే ఎందుకు నమ్ముతారు? తనకే అన్నీ తెలుసుననుకొంటూ, ఏమీ తెలీని పసి నిసుగు లాంటి కౌముదిని చూస్తే నాకెంత జాలి కలుగుతుందో ఎలా చెప్పను? వారిద్దరూ సుఖపడితే నాకన్నా సంతోషించే వాళ్ళుంటారని, నేననుకోను. కానీ వారికా రాత లేదు మరి!

“ఇప్పుడు నేనేం చెయ్యలేను. నా వల్ల కాదు” అన్నాను మా ఆవిడతో ఇవన్నీ అనడం ఇష్టం లేక.

“ఈసారికిలా పోనిండి! కనీసం వచ్చేసారయినా-”

ఎవరో నా మాడుమీద ఫెడీమని కొట్టినట్లయింది. ఈ మాటన్నదెవరు? నీవన్నావా? మా ఆవిడన్నదా? కౌముదిగానీ, మంజరి గానీ అన్నారా? ఆ అదురులో నేను గొంతు కూడా గుర్తు పట్టలేకపోయాను.

ఎవరంటే నేంగానీ, వీరిద్దరిని గురించి, ఇప్పుడు నేను చేయగలిగినదేమీ లేదు. మరోసారి వాళ్ళను గురించి రాయగలిగిందీ లేదు; రాయవలసిన అవసరం కూడా లేదు!

--0--

# ఆమె కథ! కాదు - కళ్ళ కథ!!

# కాదు కాదు - ఆ కళ్ళ కథ!!!

**చాలా** కాలమయింది కథ రాసి. అందులోనూ, సెక్సు కథ రాసి దాదాపు రెండున్నర దశాబ్దాల పైచిలుకే అయి ఉంటుంది. ఆ రోజుల్లో చలంగారూ, చౌడేశ్వరీ దేవి, ధనికొండ, నేనూ ఈ రకం కథలు ముమ్మరంగా రాస్తూ ఉండేవాళ్ళం. అంతకు ముందు చలంగారూ- ఆయనతో బాటుగా కొంత వరకూ కుటుంబరావుగారూ- ఈ కోవకు చెందిన కథలు రాశారు. ఆ దరిమిలా, కుటుంబరావుగారు, ఆ దోవలోంచి పక్కదోవకు వెళ్ళిపోయారు. తరువాత మేమంతా ఈ దోవలోకొచ్చాం.

ఈ గొడవంతా మీ ముందు వెళ్ళబోసుకుంటానికో కారణముంది. సుమారుగా పాతికేళ్ళ తరువాత మళ్ళీ సెక్సు కథ రాయాలని నాకెందుకనిపించింది? ఇప్పటికీ మార్కెట్‌లో దాని కెక్కువ

గిరాకీ ఉండడమా? లేకపోతే- నాకు నేనే విధించుకున్న పరీక్షా ఇది?

సాధారణంగా సెక్సు కథల్లో, అబ్బాయి ముఖ్యం కాదు, అమ్మాయే ముఖ్యం. ఆ అమ్మాయి మాంచి అందంగా ఉండాలి. ఆ అందాన్ని- తనివివి తీరా వర్ణించాలి. మన పూర్వ కవులు, ప్రబంధాల్లోనూ, కావ్యాల్లోనూ, కథా నాయికను వర్ణిస్తారే- శిఖనఖ పర్యంతం- అల్లాగా వర్ణించాలి. పద్యాల్లో చేసిన వర్ణన కొందరికే అర్థమయి మరికొందరికి పూర్తిగా అర్థంగాకా-- పద్యం నడక మీదా, లయమీదా, తూగుమీదా, ఆధారపడి గునుకు పరుగుతో సాగిపోతుంది. మన మహా కవులందరూ, ఆ పనే చేశారు. ఏ కథానాయిక, అంగాంగ వర్ణననూ, విడిచి పెట్టలేదు. కావ్య లక్షణం, కావ్య ప్రయోజనం, కావ్యాత్మ, కవిత్వతత్వ వివేచనం, అభిద, వ్యంజనం, అభ్యిక్తీకరణం- ఈ సరంజామానంతా కట్టగట్టి కాలవలో పారేసినా ఫర్వాలేదు. కావలసింది కథానాయకి వర్ణన-- అందులోనూ, సార్వాంగ వర్ణన- అందులోనూ, చదివేవాడి మనస్సులో... దీన్నిహ వదిలేద్దాం!

వచనంలో అలా చేయడానిక్కాదు. ఏ పాటి అక్షరజ్ఞానమున్నవారికయినా, చటుక్కున తెలిసిపోవాలి. వారికి తెలీని భావాన్ని చెప్పకూడదు. అధవా చెప్పదలచుకొంటే వారికి తెలిసిన భాషలోనే చెప్పాలి. చదివేవారు చదువుతూనే కిర్రెక్కిపోవాలి. మతి పోగొట్టుకోవాలి. ఆ తరహా సాహిత్యం కోసం జనం ఆవురావురుమనాలి. అనేట్టుగా రాయాలి. అలా రాస్తే తప్ప పత్రికలు వేసుకోవు. అలాంటివి వేస్తే తప్ప జనం కొనరు. అందుకని- కథానాయికను వర్ణించడం ముఖ్యం. ఆ అందమైన కథానాయికను, ఇంకో కథానాయకునితో కలిపేసి- ఆ తరువాత జరిగే రంగరంగ వైభవాలను కుతిదీరా వర్ణించడం సెక్సు కథల్లో మరీ ముఖ్యం.

సాధారణంగా ఈ వర్ణన కళ్ళతో ప్రారంభమవడం సాంప్రదాయం. ఆ సాంప్రదాయాన్నే నేను కూడా పాటిస్తున్నాను. అవధరించండి!

ఆమె కళ్ళు...

ఆమె కళ్ళల్లోకి చూశాను. ఆ కళ్ళు నాకు పరిచితమైనవి. ఇప్పుడిక్కడ చూస్తున్నాను గానీ, వాటిని నేను ఎక్కడెక్కడో చూశాను. ఎప్పుడెప్పుడో చూశాను. అప్పుడప్పుడూ, అక్కడక్కడా చూశాను. ఇప్పుడు మాత్రం, ఇక్కడే చూస్తున్నాను.

మీరు నన్నొక క్షణం ఆలోచించుకోనిస్తారా? ఒక్క క్షణం చాలు- ఒకే వొక్క క్షణం. ఆ క్షణకాలంలో- నా జ్ఞాపకాల మడతలన్నింటినీ, విప్పేసి, ఆ అడుగు పొరల్లో, అట్టడుగు పొరల్లో, అట్టట్టట్టట్టడుగు పొరల్లో దాగున్న స్మృతులను, స్మృతి చిహ్నాలను వెలికి తీస్తాను... ఒక్కొక్కటే మీ ముందుంచుతాను!

గిన్నె అడుగున పాలచుక్క. ఆకలితో అలమటించి పోతున్న ఓ చిన్న చీమ. గోడ మీదుగా, గిన్నె అంచుకు పాకి, లోపలికి తొంగి చూసింది. పాల చుక్క గిన్నె అడుగున ఉన్నది, ఆకలి తన దగ్గరున్నది. పాలచుక్క కోసం మెల్లగా- చాలా మెల్లగా- బహు మెల్లగా ఆ చిన్నారి చీమ, కిందికి దిగుతున్నది. కలవారి కుటుంబం గదా! కడగొట్టువాడికి వెండి గిన్నెతోనే పాలు పడతారు. గిన్నె లోతట్టున- నున్నగా- తళతళ లాడుతూ మిలమిల లాడుతూ ఉంది- వెలుగుపడినా, జారిపోయేంత

నునుపు. చిన్న చీమకు ముందు కాళ్ళు పట్టు తప్పి జారినప్పుడు, భయంతో బెంబేలెత్తిన దాని కళ్ళు నాకు గుర్తుకొచ్చాయి...

* * *

ఓసారి, కృష్ణానదికి వరదలొచ్చాయి. దరులను వొరుసుకొంటూ, తోసుకొంటూ, కోసుకొంటూ ప్రవాహం ఉరకలెత్తుతోంది. ఒడ్డునున్న మొక్కా మానూ, వరదనీటిలోకి తూలి, వాలిపోతున్నాయి. నేను - తరచుగా కూచునే జమ్మిచెట్టుకేసి చూస్తున్నాను. ఆ చెట్టునీడన కూచుని, నేను పిల్లెమ్మ ఆటలాడిన రోజులు పచ్చి వేరుశనగ మండల్ని, తంపట వేసుకొన్న రోజులు, సగం అన్నం ముందుతిని, మిగతా సగం దాని మాటున దాచుకొన్న రోజులు గుర్తుకొచ్చాయి. అర్జునుడు దాచుకొన్న పాశు పతాస్త్రం కోసం, అనేక దఫాలు, వెర్రిగా, ఆ కొమ్మల్లోకి చూడడం జ్ఞాపకం వచ్చింది. ఆ చెట్టు, వరదలో కొట్టుకుపోకుండా ఉంటే బావుండుననిపించింది. కానీ- వరద- నా మాట వినలేదు. ఓ పెద్ద తరంగం - ఉదుటుగా వచ్చి వొడ్డుకు తాకింది. పెళ్ళ- పెళ్లా నిశ్శబ్దంగా నదిలోకి జారిపోయింది. జమ్మి చెట్టు కూడా వొరిగింది. అప్పుడు సన్నగా, ఆకుపచ్చ మిణుగురుల్లా ఉండే దాని ఆకుల కళ్ళన్నీ, దీనంగా, భయంగా, నా వేపు చూడడడం గుర్తుకొచ్చింది...

* * *

చిన్నబోను. ఆ బోనులో మరీ చిన్న - కొబ్బరి ముక్క. దాని వాసన గదంతా పలచగా అలుముకొన్నది. అటూ ఇటూ గెంతి, మూ చూసి ముందుకు దూకి, బోను తీగెల్ని కొరికి, సాధ్యం కాదని తేలాక విసుక్కొని, అతి ప్రయత్నం మీద లోపలికి దూరి, కొబ్బరి ముక్కను, ఆనందంగా తిని, బయటికొచ్చేందుకు దోవ తేలీక, బిక్కుబిక్కుమంటున్న చుంచెలుక కళ్ళు నాకు గుర్తుకొచ్చాయి...

* * *

హొటలు వెనగ్గా రెండు కుప్పతొట్లు! ఆ తొట్లనిండా ఎంగిలాకులు, ఆ ఆకుల కోసం తారట్లాడే ఊరకుక్క- ఆ కుక్కను తోల లేకా, ఆకుల్ని వొదులుకోలేకా, కుక్కవేపు భయంతో, కోపంతో, అసహ్యంతో, ద్వేషంతో, కసితో, ఛలఛలమండే మంటలతో నిండిన పదేళ్ళ పసివాడి కళ్ళు గుర్తుకొచ్చాయి...

* * *

చాలా సంవత్సరాల నాటి మాట. జారిపోతున్న బొందులాగుల్ని ఎగదీసుకొంటూ, చీమిడిని ఎగబీలుస్తూ, చప్పుడు చెయ్యకుండా, వొంగి, కూచుని- తూనీగల్ని పట్టుకొని, దాని తోకలోకి ముల్లు గుచ్చితే, ఆ బాధ భరించలేకా, విదిలించుకొని పోలేకా- గిలగిలా తన్నుకొంటున్నప్పటి తూనీగ కళ్ళు గుర్తుకొచ్చాయి...

* * *

ఎందుకొచ్చిందో తెలీదు. ఓ చిమ్మట- గోడమీద వాలింది. వాలి- ముందుకాళ్ళను చాపి, ముడిచి, అలసట తీర్చుకొంటున్నది. నెత్తిమీదుగా, పైకి లేచిన రెండు మీసాలను, అటూ ఇటూ

తిప్పింది. ఎందుకోసమో, ఎవరి కోసమో, ఎదురుచూస్తున్నది. ఎదురు చూస్తున్న వారు కాకుండా- వెనగ్గా నిశ్శబ్దంగా- మెల్లిగా- పాకుతూ వచ్చి- ఠక్కుమని, బల్లి నోట కరచుకొన్నప్పుడు- ప్రాణ భీతితో విలవిలలాడే చిమ్మట కళ్ళు నాకు గుర్తుకొచ్చాయి...

* * *

ఎండా కాలం. కాలవలో నీరు ఇంకిపోతున్నది. అక్కడక్కడా- మెరకలు బయట పడుతున్నాయి కూడా. వొడ్డు నానుకొని, సన్నపాయలాగా- నీరు ముందుకు పాకుతోంది. కాస్త లోతు చూసుకొని, మాపుదించాడు జాలరి. మాపుకు దిగువగా, వొత్తుగా చిల్లకంప. ఆ కంపలోంచి నీరు తప్ప గాలి తప్ప అప్పుడప్పుడూ వెలుగు తప్ప- ఇంకేదీ వెళ్ళదు. నీటి జాలున వచ్చిన చేపలన్నీ, ముళ్ళను చూసి, వెనక్కు మళ్లి మావులో చేరేవి. ఒక రోజు, రెండు రోజులు, నలుగు రోజులు... మాపు నిండా బిలబిలలాడుతూ చేపలు. జాలరి కాలవలోకి దిగాడు. భార్య వొడ్డునే గోనె సంచీ పట్టుక్కూచుంది. సందిట నిండా చేపల్ని పట్టి, సంచీలో వేస్తున్నాడు జాలరి. అవి గిలగిల్లాడుతూ, జారిపోతూ, పారిపోతూ ఉన్నప్పుడల్లా- పళ్ళు బిగించి- వడేసి- వాటిని సంచీలోకి తోసేస్తున్నాడతను. ఆఖరికో గడుగ్గాయి మిగిలింది. అది చిక్కడం లేదు. చిక్కినట్లే చిక్కి- చటుక్కున జారి నీళ్ళలోకి తుళ్ళుతోంది. ఒకసారిగాదు- రెండుసార్లు గాదు- నాలుగైదు సార్లు. అతనిక్కోపం వచ్చింది. బురదంతా కెలికి కెలికి, ఆ దుడుకు పిండాన్ని పట్టుకొని, రెట్టకొద్దీ మైలు రాయికేసి విసిరాడు. చేప సగం దాకా చీరుకుపోయింది. అయినా బలాన్నంతా కూడ దీసుకొని, ఆఖరి ప్రయత్నంగా, శరీరాన్ని కదపడానికి ప్రయత్నించి- కదపలేకపోయినప్పటి చేపకళ్ళు నాకు గుర్తుకొచ్చాయి...

* * *

పనుల్లేవు. ఉన్నా పిలిచే వాళ్ళు లేరు. ఉన్నా పోటీ ఎక్కువ. అడుక్కుతిన్నా పెట్టే వారు లేరు. పోలిగాడి కేమీ పాలు పోలా. తను పెద్దవాడు గనుక- నాలుగైదు రోజులు తిండిలేక పోయినా తట్టుకొంటాడు. తనను చేసుకొన్న పాపానికి పెళ్ళాం కూడా పస్తులుండటానికి అలవాటు పడింది. కానీ- నాలుగేళ్ళ చంటి వెధవ ఉండలేకపోతున్నాడు. వాడి ఏడుపు చూడలేక పోలిగాడు గింగిరాలు తిరిగి పోయాడు! వలను భుజాన వేసుకుని, కొండ ప్రక్కనున్న తోపులో కొచ్చాడు. ఆ తోపు కంచెనిండా కుందేళ్ళు! వలపన్ని రేలాకు చుట్టముట్టించి- కంచెకివతలగా వచ్చి, బాణా కర్రతో కంచె మీద కొట్టడం సాగించాడు. జిమ్ము మంటూ నుసి పరుగులేచింది. ఖస్సు మంటూ పసిరిక పాము జం జర లాడుతూ తోటలోకి పాకిపోయింది. ఓ పెద్ద కుందేలు, మూడు పిల్లలూ ఛకఛక లాడి, చెవులు అటూ ఇటూ తిప్పి, చప్పున తోటలోకి పరుగెత్తాయి. తల్లి కుందేలు ముందుగానూ- పిల్లలు దాన్ని అనుసరిస్తూ- తల్లి- ఓ బారదూకి, ఆగి, ముగ్గురు పిల్లల్ని తొందరచేసి- మరో దూకుదూకి- మరోసారి ముగ్గురు పిల్లల్నీ చూసి, ఇంకోసారి దూకి, ఈసారి ఇద్దరు పిల్లల్నే చూసి, మూడో పిల్ల వలలో చిక్కి, విలవిలా గిలగిలా తన్నుకుంటున్నప్పుడు - అటు చూసి దిక్కు తోచక, బెంబేలు పడిపోతున్న తల్లికుందేలు కళ్ళు నాకు గుర్తొచ్చాయి...

* * *

అందరూ వెళ్ళిపోయారు. ఆరు గంటలూ వెళ్ళిపోయాయి. ఆపీసరు వెళ్ళలేదు. అతగాడు వెళ్ళిందాకా తనూ వెళ్ళలేదు. తన ఉద్యోగం, అతని 'ఇష్టం' మీద ఆధారపడి ఉంది. ఆ ఇష్టం తన శరీరంమీద పరుచుకొని ఉంది.

ఇంతకన్నా హీనాతి హీనమైన ఉద్యోగాలకోసం తను చేసిన ప్రయత్నాలేవీ జానకి మర్చిపోలేదు. అప్పుడప్పుడు ఆవిడ అనుకొనేది- తనకీ పేరును, తల్లిదండ్రులు ఆలోచించే పెట్టారేమోనని! ఆ జనాకి జీవితమంతా కష్టాలమయం. అక్షరాలా తన జీవితమూ అంతే అయింది.

తన చదువూ, తెలివితేటలూ, చురుకుతనమూ ఇవేవీ తన కింత అన్నం పెట్టలేకపోయాయి. ఈ యోగ్యత లెవరికీ అవసరం లేకపోయాయి. వారిక్కావలసిన 'యోగ్యత' అందం- తన వయసు- తన శరీరం... మామూలు యోగ్యతలకు చెల్లుబడి లేనప్పుడు చెల్లే యోగ్యతను తను బయట పెట్టక తప్పలేదు. ఈ నిర్ణయానికి రావటానికి ముందు జానకి, రోజులకు రోజులు ఆలోచించింది. ఆలోచించి... ఆలోచించి, ఆలోచించి అలసిపోయిందే తప్ప, మరే దోవా కనిపించలేదు.

పోనీ-

తనకు పెళ్లయినా అయి ఉంటే- ఆ బరువు బాధ్యత లేవో ఆ మొగుడనే వాడే చూసుకొనే వాడు. సంచులకు సంచులు కుమ్మరించి, తనకో భర్తను కొనే తాహతు తండ్రికి లేదు. ఉద్యోగం చేస్తున్న అమ్మాయికయితే- కట్నాల బెడద- అసలుండదని కాదుగానీ- ఇప్పుడున్నంత ఉండదు. ఆ ఉద్యోం కోసం వేట ప్రారంభించింది జానకి. చిత్రమేమిటంటే- ఉద్యోగమే జానకిని వేటాడ్డం ప్రారంభించడం.

ఈ వేట కార్యక్రమంతో జానకి పూర్తిగా అలసిపోయింది. చచ్చీచెడీ- ఈ ఉద్యోగం సంపాదించింది. నెల రోజుల పాటు 'తాత్కాలికం' అన్న షరతు మీద పనిచేసింది. ఆ నెల రోజులూ, ఈ రోజుతో పూర్తవుతాయి. ఈ రోజున 'తుది నివేదిక' ప్రధాన కార్యాలయానికి వెడుతుంది... భవిష్యత్తంతా, జానకి కళ్ళముందు మసక మసగ్గా మెదలింది!

తన సుఖం- తన పెళ్ళి మీద ఆధారపడి వుంది. తన పెళ్ళి తన ఉద్యోగం మీద ఆధారపడి ఉంది. తన ఉద్యోగం, ఈ 'తుది నివేదిక' మీద ఆధారపడి వుంది. ఆ నివేదిక, ఆఫీసరుగారి దృష్టి మీద ఆధారపడి వుంది. ఆ దృష్టిని తొణక్కుండా చేయడం తన అందం మీదా, వయసు మీదా ఆధారపడి ఉంది.

జానక్కి చెమటలు పోశాయి. చెంగుతో ముఖం తుడుచుకొంది. మెడ తుడుచుకొంది. అరచేతుల్లో ఊదుకొని, చెమటను ఆర్పుకొంది. లోపలినుంచి సెగలూ, పొగలూ, ఆవిరులూ తోసుకొస్తున్నాయి.

ఎంత స్థిమితంగా కూచుందామన్నా- జానకి కుదుటపడలేక పోతున్నది. ఏడు గంటలూ దాటాయి. ఆఫీసంతా నిశ్శబ్దం! దూరంగా పాత సీలింగ్ ఫ్యాన్ పెడుతున్న సన్నని గురక- గోడ గడియారం తననే అప్పళించి చూస్తున్నట్టు జానకి గిజాడుపడింది.

స్వింగ్ డోర్ తెరుచుకొన్నది.

మెత్తని బూట్ల చప్పుడు-

దగ్గరగా వచ్చి ఆగినట్లుగా తోచి-

జానకి తలెత్తి చూసింది.

ఎదురుగా ఆఫీసరు. అతని చేతిలో కవరు. దానిమీద హెడ్డాఫీస్ అడ్రస్. ఆ కవరులో మరో చిన్న కవరు. దానిమీద 'కాన్ఫిడెన్షియల్' అన్న వాక్యం ఎర్రగా వెక్కిరిస్తో. ఆ కవరులో రెండు టైపు చేసిన కాగితాలు.

ఆ కాగితాలు చిన్న కవర్లోకి వెళ్ళి, ఆ చిన్న కవరు పెద్ద కవర్లోకి వెళ్ళి, ఆ పెద్ద కవరు పోస్టు డబ్బాదాకా వెళ్ళడానికి- తను ఆఫీసరు గారితో వారు రమ్మన్న చోటుకు వెళ్ళాలి.

వెళ్ళడమా? మానడమా?

జానకి ఓ క్షణం ఆలోచించింది.

ఆలోచించి వెళ్ళడానికే నిశ్చయించింది. నిశ్చయించి సన్నగా నవ్వింది. ఆ నవ్వు నిప్పుల్లోంచి వచ్చినట్లుగా ఉంది. అలా చూస్తున్నప్పటి జానకి కళ్ళు నాకు గుర్తుకొచ్చాయి...

* * *

క్షమించండి!

పసందైన ప్రణయ కథను చబుతానని మాటిచ్చాను. కథా నాయికను శిఖనఖ పర్యంతం వర్ణించి, మిమ్మల్ని ఆకట్టుకొందామనుకొన్నాను. అనుకొని- సాంప్రదాయానుసారంగా, నేత్ర వర్ణనతో ప్రారంభిచాను. అయితే ఈ ప్రారంభం మీక్కావలసి నట్లుగా ప్రారంభం కాలేదు. కాలేదు సరిగదా- మరో కథకు ప్రారంభమయి కూచుంది. ఈసారికి నన్ను మన్నించండి!

మరోసారి మనం కలుసుకొన్నప్పుడు- అక్షరాలా- పసందైన మరో ప్రణయ కథనే మీకు చెబుతానని హామీ ఇస్తున్నాను.

*